# యోబు గ్రంథ ధ్యానము



రచయిత :
బ్రదర్. టి.పి. వరప్రసాదరెడ్డి
షాలోం క్రిస్టియన్ అసెంబ్లీ
# 1/183, విద్యానగర్, J.N.T.U.C. పోస్టాఫీసు,
అనంతపురము - 2. (A.P.) S. India
Cell : 94402 85883, 94406 69494

# యోబు గ్రంథ ధ్యానము

రచయిత :

**టి.పి. వరప్రసాద రెడ్డి**

పబ్లిషర్స్ :

**షాలోమ్ క్రిస్టియన్ అసెంబ్లీ**

1/183, విద్యానగర్, JNTUC పోస్టాఫీసు,

అనంతపురము- 515 002. (ఏ.పి.), సౌత్ ఇండియా

సెల్ : 9440285883, 9440669494

# యోబు గ్రంథ విభజన

## విషయసూచిక


1) యోబును గూర్చి దేవుడు సాతాను మాటలాడుకొనుట 1అ. 7

2) భార్య మాటలాడుట ముగ్గురు మిత్రుల రాక 2అ. 10

3) యోబు, తన భార్యల విలాపము 3అ. 11

యోబు స్నేహితులతో మొదటిసారి సంభాషణ 4-14అ.

4) యోబును గూర్చి ఎలీఫజు అభిప్రాయము 4-5అ. 13-15

5) స్నేహితుడైన ఎలీఫజుకు యోబు జవాబు 6-7అ. 16-17

6) యోబును గూర్చి స్నేహితుడైన బిల్దదు మాటలు 8అ. 18

7) స్నేహితుడైన బిల్దదుకు యోబు జవాబు 9-10అ. 19-21

8) యోబును గూర్చి జోఫరు అభిప్రాయము 11అ. 22

9) స్నేహితుడైన జోఫరుకు యోబు జవాబు 12-14అ. 23-25

యోబు స్నేహితులతో రెండవసారి సంభాషణ 15-21అ.

10) యోబును గూర్చి ఎలీఫజు రెండవసారి తెలుపుట 15అ. 26

11) ఎలీఫజుకు యోబు రెండవసారి జవాబు 16-17అ. 28-29

12) యోబును గూర్చి బిల్దదు రెండవసారి మాటలు 18అ. 30

13) స్నేహితుడైన బిల్దదుకు యోబు రెండవసారి జవాబు 19అ. 31

14) యోబును గూర్చి జోఫరు రెండవసారి 20అ. 33

15) జోఫరుకు యోబు రెండవసారి జవాబు 21అ. 34

యోబు స్నేహితులతో మూడవసారి సంభాషణ 22-31అ.

16) యోబును గూర్చి ఎలీఫజు నేరములు 22అ. 36

17) ఎలీఫజుకు యోబు మూడవసారి జవాబు 23-24అ. 38-39

18) యోబును గూర్చి బిల్దదు మూడవసారి మాటలు 25అ. 40

19) బిల్దదుకు యోబు మూడవసారి జవాబిచ్చుట 26-31అ. 42-51

20) యోబును గూర్చి ఎలీహు అభిప్రాయము 32-37అ. 52-59

21) ఎలీహుకు ముగ్గురు మిత్రులకు యోబు మాటలు 38-41అ. 60

యోబుతోను, అందరితోను దేవుని మాటలు 42అ. 67-68

22) దేవునితో యోబు మాటలు 42:1-6వ.

23) 42:7-29వ. యోబుతో, అందరితో, దేవుడు చివరి మాటలు

# యోబు గ్రంథ ధ్యానము

యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి, పరమగీతము అను ఈ ఐదు గ్రంథములు పాత నిబంధన గ్రంథములోని 39 గ్రంథముల విభజనలో పద్యగ్రంథములుగా వేదాంతుల విభజన అంగీకరింప తగినది. హెబ్రీ భాషలో ఈ గ్రంథమును పాటలాగా పాడవచ్చును. కాని తెలుగులో తర్జుమా చేయబడినందున ఆలాగు పాడలేము. అయిననూ హెబ్రీ భాషలో ఉన్న సంపూర్ణ దేవుని తలంపు తెలుగు తర్జుమాలో వున్న యోబు గ్రంథములో వున్నదని నూటికి నూరు పాళ్ళు మనము అంగీకరించవచ్చును. ఈ గ్రంథము ఒక నాట్యముగా వ్రాయబడినదని బైబిలు పండితులు అంగీకరింతురు. యోబు మొదటి అధ్యాయము మొదటి ఐదు వచనములను గమనింతుము.

1-5వ. ఊజు దేశమునందు యోబు అను ఒక మనుష్యుడుండెను. అతడు యదార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు. అతనికి ఏడుగురు కుమారులును ముగ్గురు కుమార్తెలును కలిగిరి. అతనికి ఏడువేల గొఱ్ఱెలును, మూడువేల ఒంటెలును, ఐదు వందల జతల యెడ్లును, ఐదు వందల ఆడ గాడిదలును కలిగి, బహుమంది పనివారును అతనికి ఆస్తిగా నుండెను గనుక తూర్పు దిక్కు జనులందరిలో అతడే గొప్పవాడుగా నుండెను. అతని కుమారులందరు వంతుల చొప్పున అనుదినము ఒకరికొకరు తమ తమ యిండ్లలో విందు చేయనై కూడునప్పుడు తమ ముగ్గురు అక్కచెల్లెండ్రు తమతో కలిసి అన్నపానములు పుచ్చుకొనవలెనని వారిని పిలిపించుచు వచ్చిరి. వారి వారి విందు దినములు పూర్తికాగా యోబు, తన కుమారులు పాపము చేసి తమ హృదయములలో దేవుని దూషించిరేమో అని వారిని పిలువనంపించి వారిని పవిత్రపరచి, అరుణోదయమున లేచి వారిలో ఒక్కకని నిమిత్తమై దహనబలి నర్పించుచు వచ్చెను. యోబు నిత్యము ఆలాగున చేయుచుండెను.

ఊజు దేశమునందు యోబు అను ఒక మనుష్యుడుండెను. కనుక యోబు ప్రపంచ చరిత్రలో వున్నవాడే. అతని దేశము చరిత్రలో వున్నది. అతనికి ఏడుగురు కుమారులును ముగ్గురు కుమార్తెలును కలుగుట. అతని ఆస్తి, పనివారను గూర్చిన వివరములు స్పష్టముగా చెప్పబడ్డాయి. గనుక తూర్పు దిక్కు జనులందరిలో అతడే గొప్పవాడుగా నుండెను అని వ్రాయబడినందున ఇవన్ని వాస్తవములని అంగీకరించాలి. మరియు యెహెజ్కేలు

14:14వ.లో నోవహును దానియేలును యోబును ఈ ముగ్గురు అట్టి దేశములో నుండినను అన్నందున నోవహు ఆది 6వ అధ్యాయములోను, దానియేలు గ్రంథములో దానియేలు వుండినవారేనని తేటపరచబడినది. వారు తమ నీతిచేత తమ్మును మాత్రమే రక్షించుకొందురు, ఈ ముగ్గురు రక్షించబడినవారే. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు మన అంగీకారమునకు తగినది. క్రొత్త నిబంధనలోని యాకోబు పత్రిక 5:11వ.లో మీరు యోబు యొక్క సహనమును గూర్చి వింటిరి. ఆయన ఎంతో జాలియు, కనికరమును గలవాడని మీరు తెలిసికొనియున్నారు.

యాకోబు 5:10వ. నా సహోదరులారా, ప్రభువు నామమున బోధించిన ప్రవక్తలను, శ్రమానుభవమునకును, ఓపికకును మాదిరిగా పెట్టుకొనుడి అన్నందున బైబిలులో మనందరికి గొప్పవాడైన యోబుకు శ్రమలు కలిగి యోబును క్రుంగదీసినందుకు మనకు శ్రమలు కలిగినను మనము క్రుంగకుండుటకు యోబు మనకు మాదిరిగా వున్నవాడని అంగీకరింతము. యోబు భార్య, పిల్లలు భక్తి కలిగి రక్షించబడిన వారని అంగీకరించవచ్చును. యోబు శ్రమలలో క్రుంగినను దేవుని ప్రశ్నించక తన్నుతాను పరీక్షించుకొన్నవాడుగా మనందరికి మాదిరిగా వున్నాడు.

## యోబు గ్రంథ విభజన

1) యోబును గూర్చి దేవుడు సాతాను మాటలాడుకొనుట 1అ.
2) యోబును గూర్చి దేవుడు సాతాను మాటలాడుకొనుట, భార్య మాటలాడుట ముగ్గురు మిత్రుల రాక. 2అ.
3) యోబు, తన భార్యల విలాపము 3అ.

యోబు స్నేహితులతో మొదటిసారి సంభాషణ. 4-14అ.

4) యోబును గూర్చి స్నేహితుడైన ఎలీఫజు అభిప్రాయము 4-5అ.
5) స్నేహితుడైన ఎలీఫజుకు యోబు జవాబు 6-7అ.
6) యోబును గూర్చి స్నేహితుడైన బిల్దదు మాటలు 8అ.
7) స్నేహితుడైన బిల్దదుకు యోబు జవాబు 9-10అ.
8) యోబును గూర్చి స్నేహితుడైన జోఫరు అభిప్రాయము 11అ.
9) స్నేహితుడైన జోఫరుకు యోబు జవాబు 12-14అ.
10) యోబును గూర్చి ఎలీఫజు రెండవసారి తెలుపుట. 15అ.
11) ఎలీఫజుకు యోబు రెండవసారి జవాబు 16-17అ.
12) యోబును గూర్చి బిల్దదు రెండవసారి మాటలు 18అ.
13) స్నేహితుడైన బిల్దదుకు యోబు రెండవసారి మాటలాడుట 19అ.
14) యోబును గూర్చి జోఫరు రెండవసారి మాటలాడుట 20అ.
15) జోఫరుకు యోబు రెండవసారి జవాబు 21అ.
16) యోబును గూర్చి ఎలీఫజు నేరములు 22అ.
17) ఎలీఫజుకు యోబు మూడవసారి జవాబు 23-24అ.
18) యోబును గూర్చి బిల్దదు మూడవసారి మాటలు 25అ.
19) బిల్దదుకు యోబు మూడవసారి జవాబిచ్చుట 26-31అ.
20) యోబును గూర్చి ఎలీహు అభిప్రాయము 32-37అ.
21) ఎలీహుకు ముగ్గురు మిత్రులకు యోబు మాటలు 38-41అ.
22) దేవునితో యోబు మాటలు 42:1-6వ.
23) యోబుతో, అందరితో, దేవుడు చివరి మాటలు 42:7-29అ.

# యోబు గ్రంథము 1వ అధ్యాయము (5+7+7+3=22వ.)

## అంశము : యోబును గూర్చి దేవుడు, సాతాను మాటలాడుట.

**1-5వ. యోబును గూర్చి దేవుడిచ్చిన సాక్ష్యము :-** 1వ. ఊజు దేశము ఎదోమునందు గానీ, దగ్గరగాగానీ ఉందని (విలాప 4:21) యోబు స్నేహితుడైన తేమానీయుడైన ఎలీఫజుకు ఎదోమియులతో సంబంధము ఉందని (యోబు 2:11, ఆది 36:11) వేదాంతుల అభిప్రాయము. యోబు (1) యదార్థవర్తనుడును, (2) న్యాయవంతుడున్నై (3) దేవునియందు భయభక్తులు కలిగి (4) చెడుతనము విసర్జించినవాడు. యోబు చెడుతనము ఉండేది (రోమా 3:23). యోబు వివేకవంతుడై పై నాలుగు లక్షణాలు కలిగి ఉన్నాడు (యోబు 28:28). అందుకే స్నేహితుల దోష ఆరోపణ అంగీకరించలేదు. 2వ. అతనికి ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలిగిరి. బహు సంతానము ఆ దినములలో ఆశీర్వాదముగా ఎంచేవారు (ఆది 12:2, 13:16, 30:1) ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము ఇవ్వబడిందని గ్రహించుదుము గాక! (ఎఫె 1:3). 3వ. అతనికి ఏడువేల గొఱ్ఱెలును, మూడువేల ఒంటెలును, ఐదువందల జతల యెడ్లను, ఐదువందల ఆడ గాడిదలను కలిగి, బహుమంది పనివారును అతనికి ఆస్తిగా నుండెను గనుక తూర్పు దిక్కు జనులు అందరిలో అతడే గొప్పవాడుగా నుండెను. మహా ధనవంతుడైనను దేవుడే ఇచ్చాడు అని గ్రహించాడు (1:21). తన ధనమును ఇతరుల మంచి కొరకు వినియోగించాడు (4:1-4; 29:12-17; 31:16-32). 4వ. అతని కుమారులందరు వంతుల చొప్పున అనుదినము ఒకరికొకరు తమతమ యిండ్లలో విందుచేయనై కూడునప్పుడు తమ ముగ్గురు అక్కచెల్లెండ్రు తమతో కలిసి అన్నపానములు పుచ్చుకొనవలెనని వారిని పిలిపించుచు వచ్చిరి. కుటుంబములోని ప్రేమ, ఐక్యత, సమాధానము, సంతోషము గొప్పగా కనబడుతున్నది. ఏడు రోజులు ఏడు మంది కుమారులు ఒక్కొక్కరు ఒక్క రోజు విందు చేసేవారు. ఆ విందుకు అక్కాచెల్లెళ్లను పిలవడము వారికి భారం లేకుండా చూడడం గొప్ప విషయం. 5వ. విందులో ఎన్నో పొరపాట్లు జరుగుతాయి, మనకు తెలుసు. వారి మధ్యలో ఒక్కోసారి నిజమైన ప్రేమ లోపించవచ్చు. ఒక అలవాటు పెట్టుకున్నారు కాబట్టి అందరిని తప్పక పిలవాలి. బయటికి పిలిచినా అంతరంగములో ఏమైనా దోషాలు ఉండవచ్చు. విందు ఇచ్చేవారికి ఇతరుల కంటే నేను గొప్పగా విందు ఇచ్చాను అనే అతిశయము కలుగవచ్చు.

అందుకే అనునిత్యం ఉదయమే యోబు బలి అర్పించేవాడు. (ఆది 8:20; లేవి 1:4) కుటుంబము యెడల జాగ్రత్త మెచ్చతగినది.

**6-12వ. యోబును గూర్చి దేవుడు సాతాను మాటలాడుకొనుట :-** 6-7వ. దేవదూతల సభలు ఉన్నాయి (2:1, కీర్త 89:7, లూకా 15:10) అందులో భూమిలో జరిగే విషయాలు చర్చించబడతాయి. (2 రాజు 22:19-22)

సాతాను కొన్ని తప్పిదాలు చేసినా ప్రస్తుతానికి ప్రధానత్వము కోల్పోలేదు. అందువల్ల పరలోక ప్రవేశము ఉన్నది. భూమి మీద మెరుపు వేగముతో వెళ్లగలడు (లూకా 10:18). దయ్యాలకు అధిపతి (మత్త 9:34). గర్జించు సింహము (1 పేతు 5:8). మోసము చేస్తాడు. నేరము మోపుతాడు. అయినా సర్వజ్ఞుడు కాదు కనుక భయము వద్దు. ఒక రోజు పరలోక ప్రవేశము కూడా కోల్పోతాడు (జెక 2:1, ప్రక 12:10)

8-12వ. దేవుడు యోబును గూర్చి ప్రస్తావిస్తూ భూమి మీద అతనివంటివాడు లేడు అని 5వ సుగుణాన్ని తెలిపాడు. యోబును దీవించి సమస్తానికి కంచె వేసినందున దేవునియందు భయభక్తిగలవాడయ్యాడు. ఇప్పుడైనా ఆయన ఆస్తిని మొత్తితే యోబు భక్తిని విడిచిపెడతాడు అని సాతాను అన్నాడు. సమస్తము నీ వశమున ఉంది కానీ యోబుకు హాని కలుగకూడదు అని దేవుడు సెలవిచ్చాడు.

దేవుని సెలవు లేకుండా ఏది జరగదు ధైర్యము తెచ్చుకుందుము గాక!

**13-19వ. యోబును దేవుని సెలవుతో సాతాను శోధించుట :-**

13వ. ఒకదాని వెంట ఒకటి కలిగిన నాలుగు విపత్తులతో యోబు జంతు సంపదను, సేవకులను, పిల్లలను సాతాను నాశనము చేస్తాడు. నలుగురు సేవకులు మాత్రము మిగిలారు.

14. షెబాయీయులు అరేబియా సంబంధులు క్రూరులు (ఆది 6,7) అని వేదాంతుల భావన. 16. దేవుని అగ్ని అంటే గొప్ప మెరుపులు కావచ్చు. 17. కల్దీయులు క్రూరులు, దోపిడీదారులు (హబక్కూకు 1:6-8). 19 సుడిగాలి టోర్నాడోలాంటిది. సాతాను సృష్టి శక్తిని అప్పుడున్న మనుష్యులను వాడుకున్నాడు. వానికేమి శక్తి లేదు అని మనము గ్రహించాలి. రేపేమి సంభవిస్తుందో మనకు తెలియదు (యాకో 4:14, ప్రస 9:12). ఏమి జరిగినా సమస్తము మన మేలుకొరకే అని నమ్మాలి.

(రోమా 8:28) పరీక్ష కొరకో పాపము కొరకో శ్రమలు వస్తాయి. దేవుడు నమ్మతగినవాడు (1 కొరిం 10:13)

**20-22వ. జరిగిన నష్టమును బట్టి యోబు లేచి వస్త్రమును చింపుకొని నేలమీద సాష్టాంగపడి నమస్కారము చేసి ప్రార్థించుట :-**

ఆస్తిపాస్తులు పోయినా యోబు నెమ్మదిగా ఉన్నాడు. పిల్లలు చనిపోయారనే వార్త వినగానే సహజమైన దు:ఖము వచ్చింది అయినా దేవునికి నమస్కరించాడు. స్తుతించాడు. సమస్తమును నష్టపోయినా ఆరాధన చేశాడు. ఇది అసామాన్య విషయము. ఇందులో యోబు ఏ పాపము చేయలేదు. దేవుడు అన్యాయస్థుడు అని చెప్పలేదు. ఎన్ని శ్రమలు వచ్చినా దేవుడు న్యాయవంతుడు అని చెప్పగలగాలి.

---

# యోబు గ్రంథము 2వ అధ్యాయము (6+2+2+3=13వ)

## అంశము :- యోబును గూర్చి దేవుడు, యోబు భార్య మాటలాడుట.

**1-6వ. యోబును గూర్చి దేవుడు సాతాను రెండవసారి మాటలాడుట :-** 1-3వ. యెహోవా సన్నిధికి అపవాది మరొక దినము వచ్చాడు. దేవుడు మళ్లీ యోబు యొక్క ఐదు సుగుణాలను ప్రస్తావించాడు. కారణం లేకుండానే పాడు చేసినా యోబు యదార్థతను వదిలిపెట్టలేదు. నువ్వు ఓడిపోయావు అన్నాడు. 4-6వ. మానవుడు ప్రాణాన్ని కాపాడుకొనుటకు సమస్తమును ఇస్తాడు. ఇంకొకసారి దేహమును మొత్తితే నిన్ను దూషించి నిన్ను విడిచి పెడతాడు అన్నాడు. దేవుడు యోబు నీ వశములో ఉన్నాడు. ప్రాణహాని మాత్రం చేయవద్దు అన్నాడు.

**7-8వ. దేవుని సెలవుతో సాతాను అరికాలు మొదలు నడినెత్తి వరకు బాధగల కురుపులతో యోబును మొత్తుట :-** దేవుని సెలవుతో అపవాది అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు బాధగల కురుపులతో మొత్తాడు. ఇంతకు మునుపు ఆస్తిపాస్తులు సంతానము పోయాయి. తను యదార్థవర్తనుడు అయినా ఆరోగ్యం పోయింది. అయినా దేవుని దూషించలేదు. ఒళ్ళు గోకుకొనుటకు బూడిదలో కూర్చున్నాడు.

**9-10వ. యోబుతో భార్య మాటలాడుట :-** భార్య వచ్చి ఇంకా యధార్థతను వదిలిపెట్టవా, దేవుని దూషించి మరణం కమ్మని చెప్పింది. యోబు బాధను చూడలేక చనిపోతే నెమ్మది పొందుతాడు అని అన్నదేగాని యోబుపై ప్రేమ లేకకాదు. మూర్ఖురాలు మాట్లాడుతున్నట్లు మాట్లాడుతున్నావు. దేవుని నుండి మేలేనా కీడు అనుభవించకూడదా అని తన యదార్థతను చాటుకున్నాడు. నోటి మాటలతో కూడా పాపము చేయలేదు. యోబు భక్తి యదార్థత మనకెంతో మాదిరి.

**11-13వ. ముగ్గురు మిత్రులు యోబును ఓదార్చుటకు వచ్చుట :-** యోబు ముగ్గురు స్నేహితులు ఎలీఫజు, బిల్దదు, జోఫరు యోబుకు సంభవించిన ఆపదలు విని యోబుతో కలసి దు:ఖించుటకు, ఓదార్చుటకు వచ్చారు. కాని యోబును పోల్చుకోలేక వారు కూడా బహుగా దు:ఖించారు. అతని బాధను బట్టి ఏడు దినములు మాట్లాడకుండా కూర్చున్నారు. వారు ఎంతో స్నేహ ధర్మాన్ని పాటించారు. యోబు బాధలను పంచుకున్నారు. తరువాత వారి మాటలలో ఏ దోషము లేకుండా శిక్షరాదు అన్న విషయాన్ని ఎక్కువ యోబుతో ప్రస్తావించారు. కానీ యోబు బాధకు కారణము ఏ దోషము కాదని యోబుకు గానీ ఆయన ముగ్గురు స్నేహితులకు గానీ తెలియదు.

# యోబు గ్రంథము 3వ అధ్యాయము (5+5+9+7=26వ.)

## అంశము :- యోబు విలాపము

**1-5వ. పుట్టిన దినమును శపించుట :-** యోబు తన తల్లి గర్భమును తను పుట్టిన దినమును శపించుచున్నాడు కానీ గర్భధారణ దేవుని ఆశీర్వాదము (ఆది 30:1-2, కీర్తన 139:13-16) మనము దేవుని ఆశీర్వాదమును శపిస్తే దేవుని మంచితనమును ప్రశ్నించిన వారమవుతాము. మగపిల్ల పుట్టుట ఆనాడు ఎంతో ఆశీర్వాదము యోబుకు కలిగిన వేదనను బట్టి ఆ దినము లేకపోవును గాక అంటున్నాడు. బిడ్డ పుట్టినప్పుడు చీకటి నుండి వెలుగులోనికి వస్తున్నది కానీ యోబు చీకటిలోనే ఉండాలనుకుంటున్నాడు. మానవుని వేదన అటువంటిది.

**6-10వ. పుట్టిన దినముననే మరణించిన మేలని తలంచుట :-** పుట్టిన దినమును శపించుచు పుట్టుకతోనే చనిపోయి ఉంటే ఈ కష్టాలు ఉండవు గదా అని యోబు తలంచుచున్నాడు.

**11-19వ. పుట్టి దినమున పాలు త్రాగకుండిన మరణించియుండునని తలంచుట :-** 11-12వ. గర్భమునుండి బయలుదేరగానే నేనెల ప్రాణము విడువకపోతిని? మోకాళ్ల మీద నన్నెల ఉంచుకొనిరి ? నేనెల స్తనములను కుడిచితిని ? నేనెల అని 4 ప్రశ్నలు వేస్తున్నాడు. దీనికి దేవుడు మాత్రమే జవాబు చెప్పగలడు. మనము చెప్పలేము. మన ప్రభువు కూడా మత్త 27:46లో నన్నెందుకు చెయ్యి విడిచితివి అంటున్నాడు. ఎందుకు అనేది మనకు దేవుడు చెప్పి ఉంటే మన పని సులభము అయ్యేది. మనము వాగ్దానాల మీద జీవించాలి. వివరణల మీద కాదు. కాబట్టి ఎందుకు ప్రభువా అని అడగడములో ఎక్కువ సమయము గడపరాదు. 13-19వ. ఎందుకో తెలిసి వుంటే నేను నిమ్మళంగా నిద్రించి ఉందును అంటున్నాడు. మరణము తర్వాత జీవితము గురించి ఆనాడు అంత వెలుగు లేదు (2 తిమోతి 1:10) మరణించిన వారు షియోల్ చేరుతారని యూదుల నమ్మకము. యోబు షియాల్‌ను కొద్దివారేమీ గొప్పవారేమి శ్రమలు బాధలు తప్పించుకొని విశ్రాంతి తీసుకునే చీకటి స్థలము అనుకున్నాడు.

**20-26వ. నెమ్మది, సుఖము లేక శ్రమ యేల సంభవించుచున్నదని తలంచుట :-** యోబు దారి తప్పిన వ్యక్తిలా ఉన్నాడు మరియు తప్పించుకునే అవకాశం లేదు.

మంచికాలం వస్తుందనే ఆశ లేదు. నిట్టూర్పు కలిగినప్పుడు ఆకలి కూడా కాదు. నీళ్లు ప్రవహించినట్లు మొఱ్ఱ పెడుతున్నాడు. ఇంత గొప్ప భక్తునికి గొప్ప భయము కలిగింది. మనము భయపడితే సాతానుకు దారి ఏర్పడుతుంది. ఏది వచ్చునని నేను బహుగా భయపడితినో అదియే నాకు సంభవించుచున్నది. నాకు భీతి పుట్టించినదే నా మీదికి వచ్చుచున్నది అని చెబుతున్నాడు. నాకు నెమ్మది లేదు, సుఖము లేదు, విశ్రాంతి లేదు శ్రమయే సంభవించుచున్నది. అందుకే ప్రభువు భయపడవద్దు అని హెచ్చరించుచున్నాడు.

# యోబు గ్రంథము 4వ అధ్యాయము (6+5+5+5 = 21వ.)

## అంశము :- ఎలీఫజు తన అనుభవమును తెలుపుట.

**1-6వ. యోబు తన యదార్థ ప్రవర్తన నిరీక్షణ కలిగియుండుట :-** ఏడు రోజుల మౌనం తర్వాత యోబు స్నేహితుడు ఎలీఫజు మాట్లాడాడు. అనేకులకు నీవు బుద్ధి నేర్పినవాడవు. బలహీనమైన చేతులను బలపరచినవాడవు. నీ మాటలు తొట్రిల్లువానిని ఆదుకొనియుండెను. క్రుంగిపోయిన మోకాళ్లు గలవానిని నీవు బలపరచితివి. అయితే ఇప్పుడు శ్రమ నీకు కలుగగా నీవు దు:ఖాక్రాంతుడవైతివి. అది నీకు తగులగా నీవు కలవరపడుచున్నావు. నీ భక్తి నీకు ధైర్యము పుట్టింపదా నీ యదార్థ ప్రవర్తన నీ నిరీక్షణకు ఆధారము కాదా? అంటున్నాడు. మెచ్చుకున్నట్లే ఉంది గానీ ఇంత భక్తిగల నీకు ఎందుకు ధైర్యము లేదు అంటున్నాడు కానీ ఇది ఓదార్చవలసిన సమయము అని మరచిపోయాడు.

**7-11వ. ఎలీఫజు తన జ్ఞానమును బట్టి నిరపరాధియైనవాడు నశింపడని చెప్పుట:-** నిరపరాధియైన వాడు నశింపడు, యదార్థవర్తనులు నిర్మూలము కారు, అక్రమమును దున్ని కీడును విత్తువారు దానినే కోయుదురు. వారు నశించుదురు అంటున్నాడు. ఇది నిజమే కానీ యోబును సాతానుకు దేవుడు అప్పగించాడని స్నేహితులకు తెలియదు.

**12-16వ. ఎలీఫజుకు దేవుని సన్నిధిని మర్త్యులు నీతిమంతులు కారను సందేశము అందించబడుట :-** ఒకమాట రహస్యంగా నా వద్దకు తీసుకు రాబడింది అని ఎలీఫజు అంటున్నాడు. నాతో కలలో ఒక రహస్యమైన దూత మాట్లాడాడు. ఎలీఫజుకు తను చెప్పిన దాన్ని బలపర్చడానికి దైవిక దర్శనము కలిగి ఉన్నాడని చెప్పుచున్నాడు. ఇది ఆదరించు విధానము కాదు. తనని హెచ్చించుకొను విధానము.

**17-21వ. దేవుడు నరులయందు ఎన్నో లోపములు కనుగొనుచున్నాడని యోబుతో చెప్పుట :-** దేవుడు దేవదూతలలోనే లోపములు కనుగొనుచున్నాడు. తమ్ము సృజించినవాని సన్నిధిని నరులు పవిత్రులగుదురా ? ఆయన తన సేవకులను నమ్ముట లేదు. తన దూతలయందు లోపములు కనుగొనుచున్నాడు. జిగటమంటి యిండ్లలో నివసించువారియందు మంటిలో పుట్టినవారియందు చిమ్మట చితికిపోవునట్లు చితికిపోవువారి యందు మరి ఎన్ని కనుగొనును ? కనుక యోబూ నీ పొరపాట్లే నీ నష్టానికి కారణం అంటున్నాడు. ఒకవేళ మన పొరపాట్లే మన నష్టానికి కారణమైనా, ఆదరించు విధానము అది కాదు అని గమనించాలి.

# యోబు గ్రంథము 5వ అధ్యాయము (7+4+5+5+6=27వ.)

## అంశము :- ఎలీఫజు తన అభిప్రాయమును తెలుపుట.

**1-7వ. శ్రమలు బాధల వలన మూఢులు ఏడ్చి నశింతురు :-**

ఎలీఫజు యోబుతో దూతలు కూడా నీకు సహాయము చేయలేరు. బుద్ధిహీనునివి కావద్దు, మూడునివి కావద్దు. కానీ పాపమునకు తీర్పు ఉంది. అసూయ, కోపము చంపుతాయి. శ్రమలు, పాపము వలననే వస్తాయి అని చెప్పుచున్నాడు. అది నిజమే కానీ యోబు శ్రమలు పాపము వల్ల కాదు అని స్నేహితులకు తెలియదు. ఇదే స్నేహితులు యోబు మీద నేరము మోపుటకు కారణమైంది. అయినా ఆదరణ ఇవ్వాలి కానీ నిరాదరణ ఇస్తున్నారు.

**8-11వ. దేవుని నాశ్రయించి వ్యాజ్యమును అప్పగించుదునని తీర్మానించుట :-**

ఎలీఫజు నేను దేవుని నాశ్రయించుదును. దేవునికే నా వ్యాజ్యమును అప్పగించుదును అని యోబు అంటున్నాడు. లెక్కలేనన్ని అద్భుత క్రియలను చేయువాడు. వర్షము కురిపించువాడు ఆయన దీనులను ఉన్నత స్థలములలో నుంచును. దు:ఖపడు వారిని క్షేమమునకు లేవనెత్తును. గనుక యోబు నా వ్యాజ్యము దేవునికే అప్పగిస్తాను అంటున్నాడు.

**12-16వ. దేవుని ద్వారానే బీదలకు దరిద్రులకు రక్షణ కలుగును :-**

వంచకులు తమ పన్నాగములను, ఉపాయములను నెరవేర్చకుండా ఆయన భంగపరచును. జ్ఞానుల ఆలోచనలను తలక్రిందులను చేయును. పగటివేళ వారికి అంధకారము తారసిల్లును. రాత్రి ఒకడు తడువులాడునట్లు మధ్యాహ్న కాలమున వారు తడువులాడుదురు. బలాఢ్యుల నోటి ఖడ్గమునుండి, వారి చేతిలో నుండి ఆయన దరిద్రులను రక్షించును. కావున బీదలకు నిరీక్షణ కలుగును. అక్రమము నోరు మూసికొనును. ఇది నిజము కానీ యోబు సంగతి అది కాదు.

**17-21వ. దేవుని శిక్షను తృణీకరింపక లోబడిన యెడల దేవుడే గాయములను కట్టి స్వస్థపరచును, కీడునుండి కాపాడును :-**

దేవుడు గద్దించు మనుష్యుడు ధన్యుడు కాబట్టి సర్వశక్తుడగు దేవుని శిక్షను తృణీకరింపకుము. ఆయన గాయపరచి గాయమును కట్టును, ఆయన గాయము

చేయును, ఆయన చేతులే స్వస్థపరచును. అన్ని బాధలలో నుండి ఆయన నిన్ను విడిపించును, క్షామకాలమున, యుద్ధ దినమున ఆయన నిన్ను తప్పించును. నోటిమాటల చేత కలుగు నొప్పి నీకు తగులకుండా ఆయన నిన్ను చాటుచేయును. ప్రళయము వచ్చినను నీవు దానికే భయపడవు. కనుక యోబూ శిక్షను తృణీకరింపకుము అంటున్నాడు. యోబు విధేయుడే కానీ ఇది పరీక్షా సమయము అని ఎవరికి తెలియదు.

**22-27వ. దేవుని శిక్షను తృణీకరింపక లోబడిన యెడల ఇల్లు, పొలము విషయములో ఏ నష్టము కలుగదు :-**

యోబుతో నీవు దేవునితో సరిగా లేవు. అందుకే నీ ఇల్లు నీ సంతానమునకు నష్టము అయింది అన్నట్లు ఎలీఫజు మాట్లాడుచున్నాడు. ఇది నిజమే కానీ యోబు శ్రమలు యోబు దోషమునకు కాదు అని ఎవరికి తెలియదు కనుక మనము ఎవరిని తీర్పు తీర్చకుందుము గాక !

## యోబు గ్రంథము 6వ అధ్యాయము (7+6+5+5+7=30వ.)

**అంశము :- ఎలీఫజు అనుభవమునకు, అభిప్రాయమునకు యోబు యొక్క జవాబు**

**1-7వ. యోబు తన విపత్తును తెలుపుట :-** యోబు నా దు:ఖము, ఆపద చక్కగా తూచబడును గాక. అపుడు నా విపత్తు సముద్రముల ఇసుకకన్నా బరువుగా కనబడును. సర్వశక్తుడగు దేవుని అంబులు నాలో చొచ్చెను. వాటి విషయమును నా ఆత్మ పానము చేయుచున్నది. దేవుని భీకర కార్యములు నాతో యుద్ధము చేయుటకై పంక్తులు తీరుచున్నవి. నేను ముట్టనొల్లని వస్తువులు నాకు హేయములైనను అవియే నాకు భోజన పదార్థములాయెను, అని వేదన చెందుచున్నాడు.

**8-13వ. దేవుని మాటలను శిక్షను ఒప్పుకొనకుంటే దేవుడు తనను నిర్మూలము చేయును గాక :-** నా విన్నపము నాకు నెరవేర్చబడును గాక. దేవుడు తన యిష్టానుసారముగా నన్ను నిర్మూలము చేయును గాక. అప్పుడు నేను పరిశుద్ద దేవుని మాటలను ఒప్పుకొనకుండలేదని నేను ఆదరణ పొందుదును, మరియు నేనెంత వేదనపడుచుండినను దాన్ని బట్టి హర్షించుదును. నా బలము, అంతము కొద్దిదే. నాలో త్రాణ యేమియు లేదు గదా, శక్తి నన్ను బొత్తిగా విడిచిపోయెను గదా అంటున్నాడు.

**14-18వ. శ్రమలలో కృంగిన యోబు దేవునియందు భయభక్తులు మానుకొనినను దయ చూపవలసిన స్నేహితులు :-** యోబు క్రుంగిపోయినవాడు సర్వశక్తుడగు దేవునియందు భయభక్తులు మానుకొనినను స్నేహితుడు వానికి దయ చూపతగును. నా స్నేహితులు ఎండిన వాగువలె నమ్మకూడని వారైరి. అంటున్నాడు.

**19-23వ. తన శ్రమలకు కారణమగు తప్పులు తెలుపుమని స్నేహితులను వేడుకొనుట:-**

వర్తకులు కొన్నిటిని నమ్మి నష్టాలపాలవుదురు. అవమానమొందుదురు. అటువలె నా స్నేహితులు యున్నారని యోబు అంటున్నాడు. నాకు ఏమైనా సహాయము చేయమన్నానా అంటున్నాడు, ఎందుకు నన్ను ఇబ్బంది పెడతారు అంటున్నాడు.

**24-30వ. యోబులోని తప్పులు తెలుపలేకపోయిన స్నేహితులు :-** యోబు నాకుపదేశము చేయుడి, నేను మౌనినై యుండెదను. ఏ విషయమందు నేను తప్పిపోతినో అది నాకు తెలియజేయుడి అంటున్నాడు. యదార్థమైన మాటలు ఎంతో బలమైనవి అయినను మీ గద్దింపు దేనికి ప్రయోజనము ? దయచేసి నావైపు చూడుడి, మీ ముఖము ఎదుట నేను అబద్ధమాడుదునా ? అన్యాయము లేకుండా నా సంగతి మరల విచారించుడి. మరలా విచారించుడి, నేను నిర్దోషినిగా కనబడుదును అని తన యదార్థతను చెప్పున్నాడు.

# యోబు గ్రంథము 7వ అధ్యాయము (6+4+6+5=21వ.)

**అంశము :- యోబు తన బాధను వివరించుట.**

**1-6వ. చర్మము మానిన మరల పగులుచున్నందున నిరీక్షణ లేకపోవుట :-** మానవ జీవితము యుద్ధము లాంటిది. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. కూలివాని దినములవంటివి. పని అయిపోయిన తర్వాత యజమానుడు కూలి ఎప్పుడిస్తాడో అని కనిపెట్టుకొను దాసునిలాంటిది. ఆయాసముతో కూడిన రాత్రులు, పురుగులతో కప్పబడిన దేహము, మానుతూ పగులుతూ ఉండే చర్మముతో దినములు వడిగా గడిచి నిరీక్షణ లేకుండా ఉన్నాను అని యోబు అంటున్నాడు. ఆయన వేదన చూసిన స్నేహితులు ఆదరించాలి కానీ నిరాదరణకు గురి చేస్తున్నారు.

**7-10వ. పాతాళమునకు దిగిపోయినవాడు మరి ఎప్పుడును రాడు :-** యోబు దేవునితో చెప్పుకుంటున్నాడు. నా జీవము వట్టి ఊపిరి. నేను ఎప్పుడు వెళ్లిపోతానో తెలియదు. ఎప్పుడు పాతాళానికి వెళతానో తెలియదు. వెళ్లినవాడు తిరిగి రాడు అని తన స్థితిని జ్ఞాపకమునకు తెచ్చుకుంటూ వేదన చెందుచున్నాడు.

**11-16వ. క్రుంగుదలను బట్టి మరణమును కోరుకొను యోబు :-** నేను నా వేదన కొలది మాటలాడెదను. నా మనోవేదనను బట్టి మూల్గుదును. నేను గొప్పవాన్ని కాదు గదా నన్నెందుకు ఇబ్బంది పెడతావు. నా మంచము, నా పరుపు నాకు శాంతి ఇచ్చును అని నేననుకొనగా నీవు స్వప్నముల వలన, దర్శనము వలన నన్ను బెదిరించెదవు, భయపెట్టెదవు. ఈ నా యెముకలను చూచుటకన్న మరణమొందుట నాకిష్టము. నిత్యము బ్రదుకుటకు నాకిష్టములేదు. నా దినములు ఊపిరివలె నున్నవి. నా జోలికి రావద్దు. యోబు వేదనను ఇక్కడ మనము గమనించవచ్చు. అది మనకు మాదిరి.

**17-21వ. అతిక్రమములను పరిహరింపమని యోబు దేవుని వేడుకొనుట :-** మనుష్యులను ఎందుకు ఘనపరచుచున్నావు ? అతని మీద నీవు మనస్సు నిలుపనేల ? ప్రతి క్షణమున నీవతని శోధింపనేల ? నేను పాపము చేసితినా ? నాకు నేనే భారముగా నున్నాను, నీవేల గురిపెట్టితివి ? నా అతిక్రమమును పరిహరింపుము. నా దోషమును క్షమింపుము, నేనిప్పుడు మంటిలో పండుకొనెదను. నీవు నన్ను జాగ్రత్తగా వెదకెదవు గాని నేను లేకపోయెదను. ఆఖరుకు తప్పులను క్షమింపమని కోరుకుంటున్నాడు ఇదే ఎవరి దారైనా !

# యోబు గ్రంథము 8వ అధ్యాయము (7+3+5+7=22 వ.)

## అంశము:- యోబు యదార్థవంతుడైన యెడల దేవుడు త్రోసివేయక నోటినిండ నవ్వు కలుగజేసి, పెదవులను నింపునని బిల్దదు చెప్పుట.

**1-7వ.** కుమారులు పాపము చేసిరేమో జాగ్రత్తగా వెదకిన దిద్దుకొనినయెడల దేవుడు యోబు నివాస స్థలమును వర్ధిల్లజేయునని బిల్దదు చెప్పుట :-బిల్దదు యోబుతో సుడిగాలివంటి యోబు నోటిమాటలు దేవుడు న్యాయవిధిని రద్దుపరచవని కుమారుల పాపమును బట్టి దేవుడు వారిని మరణమునకు అప్పగించెనేమో ఆలోచించమని బిల్దదు చెప్పుచున్నాడు. యోబు పవిత్రుడై దేవుని బతిమాలుకొనిన యెడల దేవుడు యోబు నీతికి తగినట్టుగా అభివృద్ధి పొందునని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు.

**8-10వ.** మునుపటి తరము వారిని పరీక్షించి తెలిసికొనుమని బిల్దదు సలహా ఇచ్చుట:- మనము నిన్నటివారమే, మనకు ఏమియు తెలియదు భూమి మీద మన దినములు నీడవలె నున్నవి. మునుపటి తరమువారు పరీక్షించి తమ అనుభవమును బట్టి చెప్పు సంగతులు యోబు తెలిసికొనవలెనని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు.

**11-15వ.** దేవుని మరచువారందరు బురదవలె వాడిపోవుదురు :- నీళ్లు లేకుండ జమ్ము, రెల్లు మొలిచి పెరుగవని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు. అవి ముందు బహుపచ్చగా నుండినను కోయబడిన తరువాత మొక్కలన్నిటి కంటె త్వరగా వాడిపోవునని, దేవుని మరచువారందరి గతి అట్లే ఉండునని భక్తిహీనుని ఆశ నిరర్థకమై భంగమగునని అతని యిల్లు నిలువదని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు.

**16-22వ.** దేవుడు యదార్థవంతుని త్రోసివేయడు-దుష్కార్యములు చేయువారిని నిలువబెట్టడు :- 16-19వ. దుష్కార్యములు చేయువాడు తన యిల్లును గట్టిగా కట్టుకొనినను అది పడిపోవును. అతని తీగెలు తోటమీద అల్లుకొనినను అంతమగునని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు. 20-22వ. దేవుడు యదార్థవంతుని త్రోసివేయడని, దుష్కార్యములు చేయువారిని నిలువబెట్టడని, పగపట్టువారిని అవమాన భరితులుగాచేసి, యోబుకు నోటినిండ నవ్వు, ప్రహర్షము కలుగజేయునని, బిల్దదు యోబుకు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 9వ అధ్యాయము (10+6+8+5+6 = 35వ.)

## అంశము :- బిల్దదుకు యోబు చెప్పుట

**1-10వ. దేవుడు మహా వివేకి, ఆయనతో పోరాడ తెగించను :-** 1-6వ. యోబు బిల్దదుతో నరుడు దేవుని దృష్టికి నిర్దోషి కాలేడని, దేవుని ప్రశ్నలలో ఒక్కదానికైనను నరుడు ఉత్తరమియ్యలేడని, యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. ఆయన దేవుడు మహా వివేకి, అధిక బలసంపన్నుడని ఆయనతో పోరాడి హానినొందని వాడెవడును లేడని భూమిని దాని స్థలములోనుండి కదిలించి, పర్వతములను తీసివేయువాడు, దేవుడే అని గుర్తించవలెనని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. 7-10వ. దేవుడు సూర్యునికి ఉదయింపవద్దని ఆజ్ఞాపింపగా సూర్యుడు ఉదయింపడు, దేవుడు నక్షత్రరాసులను చేసినవాడు, మరుగుపరచువాడు, ఆకాశ మండలమును విశాలపరచువాడు, సముద్రము మీద నడుచువాడు, లెక్కలేనన్ని అద్భుత క్రియలు చేయుచున్నాడని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు.

**11-16వ. దేవుడు శ్రమపెట్టినను నీవేమి చేయుచున్నావని ఆయనను అడుగను :-** ఆయన నా సమీపమున పున్నాడుగాని దేవుడు యోబుకు కనబడడని, యోబు దేవునిని కనుగొనలేనని బిల్దదుతో చెప్పుచున్నాడు. నీవేమి చేయుచున్నావని దేవునిని యోబు అడుగ తగినవాడను కానని చెప్పుచున్నాడు. 14-16వ. దేవునికి ప్రత్యుత్తరమిచ్చుటకు, వాదించుచు సరియైన మాటలు పలుకుటకు తగినవాడను కానని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. తాను నిర్దోషినై యుండినను ఆయనకు ప్రత్యుత్తరము చెప్పక, న్యాయకర్తయని దేవునిని బతిమాలుకొని మొఱ్ఱపెట్టుదునని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు.

**17-24వ. దేవుడు యోబును శ్రమపెట్టిన వివరము :-** 17-20వ. దేవుడు యోబు ప్రార్థన ఆలకింపక యోబును నిర్నిమిత్తముగా నలుగగొట్టి, గాయములను విస్తరింపజేయుచున్నాడని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. యోబు యదార్థవంతుడైనను తన వ్యాజ్యము న్యాయమైనను తన మాటలు తన మీద నేరముమోపి, తనను దోషియని దేవుడు నిరూపించునని యోబు చెప్పుచున్నాడు. 21-24వ. నేను యదార్థవంతుడనైనను యదార్థవంతుల నేమి దుష్టుల నేమి భేదము లేకుండా దేవుడు అందరిని నశింప జేయుచున్నాడని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. భూమి దుష్టుల చేతికి అప్పగింపబడి

యున్నందున న్యాయాధిపతులు మంచి చెడ్డలు గుర్తింపులేకుండ ఆయన చేసియున్నాడని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు.

**25-29వ. దేవుడు నిర్దోషినిగా ఎంచడను సంగతి ఎరిగియున్న యోబు :-** దేవుడు యోబును నిర్దోషినిగా ఎంచడను సంగతి నిశ్చయముగా యోబు ఎరిగియున్నాను. సమస్త బాధలకు భయపడి వణకుచున్నానని చెప్పుచున్నాడు. యోబు తన దినములు త్వరగా క్షేమము లేకయే గతించి పోవుచున్నవని, తన శ్రమను మరచిపోయెదనని దు:ఖముఖుడై యుండుటమాని సంతోషముగా నుండెదనని అనుకొనలేదని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు.

**30-35వ. దేవుడు నిర్దోషినిగా ఎంచడను సంగతి దేవునితో అంగీకరించిన యోబు :-** యోబు హిమముతో, సబ్బుతో చేతులు కడుగుకొనినను దేవుడు తనను గోతిలో ముంచునని తనకు తానే అసహ్యుడనగుదునని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. దేవుడు తనవలె నరుడు కాడని, యోబు దేవునితో వ్యాజ్యమాడనని చెప్పుచున్నాడు. దేవుడు, యోబు యిద్దరిమీద చెయ్యి ఉంచదగిన మధ్యవర్తిలేడని చెప్పుచున్నాడు. దేవుడు యోబు మీద నుండి దండమును తీసివేసిన యోబు దేవునితో భయపడక మాటలాడెదనని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 10వ అధ్యాయము (7+5+5+5+6=22వ.)

**అంశము :- బిల్దదుకు యోబు చెప్పుట కొనసాగుట.**

**1-7వ. బ్రదుకునందు విసుకుతో దేవుని ప్రశ్నించుట :-** యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. తన బ్రదుకునందు తనకు విసుకు పుట్టినదని తాను మనోవ్యాకులము బట్టి అంగలార్చెదనని చెప్పుచున్నాడు. దేవుడు ఎందుకు తనతో వ్యాజ్యమాడు చున్నాడో తనకు తెలియజేయుమని దేవునితో చెప్పెదనని యోబు అనుచున్నాడు. దుష్టులు దౌర్జన్యము చేయుచు దేవుని హస్తకృత్యములను తృణీకరించుట దేవునికి సంతోషము కాదని, నరులు ఆలోచించునట్లు దేవుడు ఆలోచించువాడు కాడని యోబు చెప్పుచున్నాడు. యోబు దోషికాదని దేవుడు ఎరిగియుండినను యోబులో పాపము ఎందుకు వెదకుచున్నాడని యోబు చెప్పుచున్నాడు.

**8-12వ. దేవుడు అవయవ నిర్మాణము చేసిన సంగతి జ్ఞాపకము చేసికొనుట :-** దేవుని హస్తములు యోబుకు అవయవ నిర్మాణముచేసి జిగటమన్నుగా రూపించిన సంగతిని జ్ఞాపకము చేసికొనుమని యోబు దేవునితో చెప్పుచున్నాడు. చర్మముతో మాంసముతో కప్పి, ఎముకలతోను, నరములతోను సంధించి, జీవమును అనుగ్రహించి, కృపచూపి, ఆత్మను కాపాడితివని దేవునితో యోబు చెప్పుచున్నాడు. నీవు నన్ను మరల మన్నుగా చేయుదువా అని యోబు దేవుని అడుగుచున్నాడు.

**13-17వ. తన లోపములనుగూర్చి దేవుడు ఆలోచించుచున్నాడని గుర్తించుట:-** దేవుడు తన లోపములను గూర్చి ఆలోచించి, కనిపెట్టుచున్నాడని తాను ఎరుగుదునని యోబు చెప్పుచున్నాడు. యోబు దోషములు చేసిన యెడల అవమానముతో నిండుకొని తనకు కలిగిన బాధను తలంచుకొందునని చెప్పుచున్నాడు. యోబును సింహము వేటాడునట్లు దేవుడు వేటాడుచున్నాడని యోబు చెప్పుచున్నాడు.

**18-22వ. నేను ప్రాణము విడిచియుండిన యెడల మేలని పలికిన యోబు :-** దేవుడు తల్లి గర్భములోనే యోబు ప్రాణము విడుచునట్లు చేసిన యెడల గర్భము నుండి సమాధికి కొనిపోబడియుందునని అది తనకు మేలని యోబు చెప్పుచున్నాడు. తాను బ్రతుకు దినములు కొంచెమే అని యోబు గుర్తించి తిరిగి వెలుపలికి రాజాలని దేశమునకు మరణాంధకారము కలిగి భ్రమపుట్టించు దేశమునకు వెళ్లకముందు కొద్దిసేపు తన జోలికి రాకుండుమని దేవుని అడుగుచున్నాడు.

# యోబు గ్రంథము 11వ. అధ్యాయము (6+6+4+6=22వ.)

## అంశము :- నయమాతీయుడైన జోఫరు మొదటిసారి మాటలాడుట.

**1-6వ. యోబు ప్రగల్భములను పలుకుచున్నాడని చెప్పు జోఫరు :-** 1-2వ. యోబు వదరుబోతు వ్యాజ్యమునకు యోబు ప్రత్యుత్తరము చెప్పవలెనని జోఫరు చెప్పుచున్నాడు. 3-4వ. యోబు తాను పవిత్రుడనని తన ఉపదేశము నిర్దోషమని చెప్పు మాటలను, మనుష్యులు విని మౌనముగా నుండరని జోఫరు చెప్పుచున్నాడు.

5-6వ. దేవుని జ్ఞానము యోబు యోచనకు మించినదని యోబు తెలిసికొనవలనని యోబు దోషములో అధిక భాగము దేవుడు మరచి పోయాడని తెలిసికొనుమని జోఫరు చెప్పుచున్నాడు.

**7-12వ. దేవుని గూడాంశములను యోబు తెలిసికొనవలెనని చెప్పుచున్న జోఫరు :-**

7-9వ. దేవుని జ్ఞానము ఆకాశ వీధి అంత ఉన్నతమైనదని, పాతాళముకంటె లోతుగా నున్నదని, దాని పరిమాణము భూమికంటె, సముద్రముకంటె అధికమైనదని జోఫరు యోబుకు చెప్పుచున్నాడు.

10-12వ. ఆయన సంచారము చేయుచు ఒకని చెరలోవేసి వ్యాజ్యమాడ పిలిచినప్పుడు ఆయనను ఎవరు అడ్డగింపలేరని, పనికిమాలిన వారెవరో ఆయనే యెరుగునని, పాపము ఎక్కడ జరుగుచున్నదో యోబు గ్రహించవలెనని చెప్పుచున్నాడు.

**13-16వ. యోబుకు జోఫరు చెప్పిన తన ఆలోచన :-** నీవు నీ మనస్సును తిన్నగా నిలిపిన యెడల నీ చేతులు ఆయనవైపు చాపిన యెడల పాపమును నీవు విడిచి దుర్మార్గతను కొట్టివేసిన యెడల నీ గుడారములలో నుండి నిశ్చయముగా నిర్దోషివై, స్థిరపడి, దుర్దశను మరచి, సంతోషించెదవని యోబుతో జోఫరు చెప్పుచున్నాడు.

**17-22వ. యోబుకు జోఫరు చెప్పిన తన ఆలోచన ముగింపు :-** యోబు బ్రదుకు మధ్యాహ్న కాల తేజస్సుకంటె అధికముగా ప్రకాశించి, అరుణోదయమువలె కాంతిగా నుండునని యోబుకు చెప్పుచున్నాడు. నమ్మకమునకు ఆస్పదము కలుగును గనుక యోబు ధైర్యముగా ఉండి ఎవరి భయము లేకుండా యింటిలో సురక్షితముగా పండుకొందువని జోఫరు చెప్పుచున్నాడు. దుష్టులు వారికి ఆశ్రయము లేక ప్రాణము ఎప్పుడు విడిచెదమా అని వారు ఎదురు చూచుచుందురని జోఫరు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 12వ అధ్యాయము (6+6+7+6=25వ.)

**అంశము :- నయమాతీయుడైన జోఫరుకు యోబు జవాబు.**

**1-6వ.** నేను మీకంటె తక్కువ జ్ఞానము కలవాడను కానని యోబు స్నేహితులతో చెప్పుట :- 1-2వ యోబు స్నేహితులే నిజముగా లోకములో జ్ఞానముగల వారని వారితోనే జ్ఞానము గతించిపోవునని స్నేహితులు తలంచుట తప్పని యోబు చెప్పుచున్నాడు. 3-4వ. యోబు స్నేహితులకంటే ఎక్కువ జ్ఞానము కలిగియుండి దేవునికి మొఱ్ఱపెట్టి ప్రత్యుత్తరములు పొందినవాడైనను స్నేహితులకు అపహాస్యాస్పదముగా నుండవలసి వచ్చెనదని యోబు చెప్పుచున్నాడు. 5-6వ. దేవునికి కోపము పుట్టించువారు నిర్భయముగానుండి తమ బలమే తమకు దేవుడనుకొనుట తప్పని యోబు చెప్పుచున్నాడు. దుర్దశ నొందినవానిని తిరస్కరించుట క్షేమముగలవారు యుక్తమనుకొనుట తప్పని యోబు స్నేహితులకు చెప్పుచున్నాడు.

**7-12వ. జీవరాసుల ప్రాణము ఆత్మలు దేవుని వశముననున్నవని చెప్పుట :- 7-9వ.** భూమి, సముద్రము, ఆకాశమందు నివసించు జీవరాసులను యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని గుర్తించి వాటిని విచారించిన అవి సంగతులను తెలియజేయునని యోబు చెప్పుచున్నాడు. 10-12వ. జీవరాసుల ప్రాణమును మనుష్యుల ఆత్మలు దేవుని వశమునవున్నవని స్నేహితులు తెలిసికొనవలెనని యోబు చెప్పుచున్నాడు. వృద్ధులకు వివేచన, దీర్ఘాయువు దేవుని వలన కలుగుచున్నవని స్నేహితులు గుర్తించవలెనని యోబు చెప్పుచున్నాడు.

**13-19వ. దేవుని జ్ఞానశౌర్యములను గూర్చి యోబు మాటలాడుట :- 13-15వ.** జ్ఞానము, ఆలోచన, వివేచన, దేవునియొద్ద ఉన్నవని స్నేహితులు తెలిసికొనవలెనని దేవుడు మనుష్యుని పడగొట్టి చెరలో మూసివేయగా తెరచుట ఎవరికిని సాధ్యము కాదని యోబు చెప్పుచున్నాడు. దేవుని జ్ఞానము జలములను బిగబట్టగా అవి ఆరిపోవునని, వాటిని ప్రవహింపనియ్యగా అవి భూమిని ముంచి వేయునని యోబు చెప్పుచున్నాడు.

16-19వ. మోసపడువారు, మోసపుచ్చువారు, దేవుని వశముననున్నారు. దేవుడు ఆలోచనకర్తలను, వస్త్రహీనులనుగాచేసి వారిని తోడుకొని పోయి కొట్టివేయును. యాజకులను వస్త్రహీనులనుగాచేసి పడగొట్టునని యోబు స్నేహితులకు చెప్పుచున్నాడు.

**20-25వ. వాక్చాతుర్యము గలవారిని పెద్దలను బుద్ధిలేని వారినిగా చేయును :-** వాక్చాతుర్యముగలవారి పలుకును ఆయన నిరర్థకముచేసి, పెద్దలకు, నడికట్టను విప్పునని యోబు చెప్పుచున్నాడు. అధిపతుల వివేచనను నిరర్థకపరచి త్రోవలేని మహారణ్యములో వారిని తిరుగులాడ చేయునని, యోబు స్నేహితులకు చెప్పుచున్నాడు.

## యోబు గ్రంథము 13వ అధ్యాయము (9+9+5+5=28వ.)

**అంశము :- స్నేహితుడైన జోఫరుకు యోబుకు మరికొంత జవాబు.**

**1-9వ. యోబు స్నేహితులకంటే తక్కువ జ్ఞానము గలవాడను కానని చెప్పి దేవునితో మాటలాడగోరుట :-** 1-3వ. యోబు తన స్నేహితులకంటే తక్కువ జ్ఞానము గలవాడను కానని సర్వశక్తుడగు దేవునితో మాటలాడి, వాదింప గోరుచున్నానని స్నేహితులతో యోబు చెప్పుచున్నాడు. 4-6వ. యోబు స్నేహితులు అబద్ధములు కల్పించు పనికిమాలిన వైద్యులని, వారు మౌనముగా నుండి యోబు వ్యాజ్యమును ఆలకించవలెనని చెప్పుచున్నాడు. 7-9వ. యోబు స్నేహితులు దేవుని పక్షముగా మోసములు పలుకుచున్నారని, పక్షపాతముతో వాదించుచున్నారని స్నేహితులు తెలిసికొనవలెనని చెప్పుచున్నాడు. స్నేహితులు దేవుడు యోబును పరిశోధించుచున్నాడని తెలిసికొనవలెనని యోబు చెప్పుచున్నాడు. యోబు స్నేహితులు దేవునికి మోసము చేయుచున్నారని గుర్తించవలెనని యోబు చెప్పుచున్నాడు.

**10-18వ. దేవునికి భయపడవలెనని యోబు స్నేహితులకు చెప్పుట :-** 10-15వ. యోబు స్నేహితులు పక్షపాతము చూపిన యెడల నిశ్చయముగా దేవుడు వారిని గద్దించునని స్నేహితులు గుర్తించవలెనని చెప్పుచున్నాడు. యోబు స్నేహితుల హెచ్చరిక మాటలు బూడిద సామెతలని, వారి వాదములు మంటి వాదములని స్నేహితులు గుర్తించవలెనని చెప్పుచున్నాడు. స్నేహితులు యోబు జోలికి రాక మౌనులైయుండవలెనని దేవుని కొరకు కనిపెట్టుచు తెగించి దేవునితో మాటలాడెదనని చెప్పుచున్నాడు. దేవుని సన్నిధిని తన ప్రవర్తన న్యాయమని రుజువుపరతునని యోబు చెప్పుచున్నాడు. 16-18వ. నా మాటలను శ్రద్ధగా ఆలకించుడి. నా ప్రమాణ వాక్యములు మీ చెవులలో చొరనీయుడి. యోబు తన వ్యాజ్యము సరిచేసికొనియున్నాడు. తాను దేవుని సన్నిధిలో నిర్దోషిగా కనబడుదునని యోబు చెప్పుచున్నాడు.

**19-23వ. నా అతిక్రమములు, పాపములు తనకు తెలియజేయుమని దేవునికి మనవి చేయుట :-** స్నేహితులలో ఎవరైన వ్యాజ్యమాడ కోరినచో తాను నోరుమూసికొని ప్రాణము విడిచెదనని యోబు చెప్పుచున్నాడు. తనను బెదిరింపక పిలిచిన యెడల యోబు దేవునికి ప్రత్యుత్తరమిచ్చెదనని యోబు చెప్పుచున్నాడు. తన పాపములు ఎన్నియో తనకు తెలియజేయుమని దేవుని వేడుకొన్నాడు.

**24-28వ. తాను అటు ఇటు కొట్టుకొని పోవుచున్న ఆకువని తనను వేధించవద్దని దేవుని వేడుకొనుట :-** యోబునుదేవుడు పగవానిగా ఏల ఎంచుచున్నాడని యోబు అడుగుచున్నాడు. యోబు తాను ఎండిపోయిన చెత్తనని బాల్యకాలపు పాపములను బట్టి దేవుడు బొండలలో కాళ్లు బిగించియున్నాడని చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 14వ అధ్యాయము (6+6+5+5=22వ.)

**అంశము :- స్నేహితుడైన జోఫరుకు యోబు మరికొంత జవాబు ముగింపు.**

**1-6వ.** స్త్రీ కనిన నరుని జీవితము కొద్దిపాటిది :- 1-3వ. స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధనొందునని, పువ్వు వికసించినట్లువాడు పెరిగి వాడిపోగా, వాని నీడ కనబడకపోవునట్లు వాడు నిలువక పారిపోవునని యోబు చెప్పుచున్నాడు. దేవుడు అట్టి యోబు మీద కనుదృష్టియుంచి తీర్పు నొందుటకై దేవుడు తన యెదుటికి రప్పించియున్నాడని యోబు చెప్పుచున్నాడు. 4-6వ. పాప సహితునిలో నుండి పాపరహితుడగు దేవుడు పుట్టగలిగిన మేలని ఆలాగున ఎప్పుడును పుట్టనేరడని యోబు చెప్పుచున్నాడు. నరుల ఆయుష్కాలము పరిమితి కలదని, దేవునికి తెలిసియున్నదని, మించజాలని వయసు పరిమాణమును దేవుడు నరులకు నియమించియున్నాడని యోబు చెప్పుచున్నాడు. కూలివారివలె నరులు తమకు నియమింపబడిన పనిని ముగించువరకు వారు విశ్రమము నొందునట్లు వారివైపు దేవుడు చూడకయుండునని యోబు చెప్పుచున్నాడు.

**7-12వ.** నరులు ప్రాణము విడిచిన **తరువాత మరణింతురు.**

**13-17వ. యోబు నిరీక్షణ :-** యోబు దేవుని కోపము చల్లారువరకు దేవుడు తనను పాతాళములో దాచిన మేలని యోబు చెప్పుచున్నాడు. దేవుడు యోబుకు నీవు నియమించిన కాలమైన తరువాత జ్ఞాపకము చేసికొనవలెనని యోబు దేవుని కోరుచున్నాడు. మరణమైన తరువాత నరులు బ్రతికినయెడల తనకు విడుదల కలుగువరకు యోబు కనిపెట్టి దేవుడు పిలచినయెడల ప్రత్యుత్తరమిత్తునని యోబు చెప్పుచున్నాడు. దేవుడు యోబు అడుగులను లెక్కపెట్టుచు అతిక్రమమును సంచిలో భద్రముగా ఉంచాడని యోబు చెప్పుచున్నాడు.

**18-22వ. యోబు నిరీక్షణ ముగింపు :-** పర్వతములు పడిపోయి స్థానము తప్పి నాశనమై జలము రాళ్లను అరగదీయగా, దాని ప్రవాహములు భూమి యొక్క ధూళిని కొట్టుకొనిపోవునట్లు చేయునని యోబు చెప్పుచున్నాడు. దేవుడు నరులను భంగపరచగా వారు గతించిపోవునట్లు వారిని వెళ్లగొట్టుచున్నాడు. వారి కుమారులు ఒకవేళ ఘనత వహించినను అది వారికి తెలియకపోవునని తమ మట్టుకు తామే శరీరమునందు నొప్పి చేత ప్రాణమునందు దు:ఖపడుదురని యోబు చెప్పుచున్నాడు.

## యోబు గ్రంథము 15వ. అధ్యాయము (8+8+9+10=35వ.)

### అంశము :- యోబును నిష్ప్రయోజనమైన మాటలచేత మాటలాడుచున్నాడన్న ఎలీఫజు.

**1-8వ. యోబు నిష్ప్రయోజనమైన మాటలచేత వాదించుచున్నాడని ఎలీఫజు నివారించుట:-** యోబు జ్ఞానముగలవాడని తలంచి నిరర్థకమైన తెలివితో మాటలాడుచున్నాడని, వ్యర్థమైన, నిష్ప్రయోజనమైన మాటలచేత దేవునితో వ్యాజ్యమాడుచున్నాడని ఎలీఫజు చెప్పుచున్నాడు. యోబు దేవుని గూర్చిన ధ్యానమును హీనపరచుచున్నాడని, యోబు మాటలవలన తెలియబడుచున్నదని, యోబు తన మాటల వలన దోషమును స్థాపించుచున్నాడని, యోబు పెదవులే సాక్ష్యము పలుకుచున్నవని ఎలీఫజు చెప్పుచున్నాడు. యోబు తాను జ్ఞానవంతుడని దేవుని ఆలోచనలే తాను చేయుచున్నానని యోబు తప్పుగా తలంచుచున్నాడని ఎలీఫజు చెప్పుచున్నాడు.

**9-16వ. దేవుడు సెలవిచ్చిన ఆదరణను యోబు తేలికగా తీసుకొనకూడదని ఎలీఫజు చెప్పుట :-** 9-10వ. యోబు స్నేహితులతో యోబు తండ్రికంటె పెద్దవారుగా వున్నవారు గ్రహింపలేనిది యోబు ఏ రీతిగా గ్రహింపగలడని ఎలీఫజు యోబుతో చెప్పుచున్నాడు. 11-13వ. యోబు హృదయములో క్రుంగి ఆగ్రహపడుచు దేవుడు సెలవిచ్చిన ఆదరణను తేలికగా తీసికొన్నాడని ఎలీఫజు చెప్పుచున్నాడు. 14-16వ. శుద్ధుడగుటకు, నిర్దోషుడగుటకు స్త్రీకి పుట్టినవాడు నరుడు ఏపాటివాడో యోబు ఆలోచించవలెనని ఎలీఫజు చెప్పుచున్నాడు. ఆకాశ వైశాల్యము దేవుని దృష్టికి పవిత్రముకాదు, దేవుడు తన దూతలయందు నమ్మికయుంచలేదు. అట్లుండగా హేయుడు చెడినవాడు నీళ్లు త్రాగునట్లు దుష్క్రియలు చేయు మానవుడు మరి అపవిత్రుడని యోబు గుర్తించవలెనని ఎలీఫజు చెప్పుచున్నాడు

**17-25వ. యోబు తన దుష్టత్వమునుబట్టి జీవితకాలమంత బాధనొందునని ఎలీఫజు చెప్పుట :-** 17-19వ. అన్యులతో సహవాసము చేయక తాము స్వాస్థ్యముగా పొందిన దేశములో నివసించిన జ్ఞానులు చెప్పిన బోధను యోబుకు తెలిపెదనని యోబు ఆలకించవలెనని ఎలీఫజు చెప్పుచున్నాడు. 20-22వ. హింసకుడగు దుష్టుడు తన జీవితకాలమంత బాధనొందును. భీకరమైన ధ్వనులు వాని చెవులలో వినబడును,

తాను చీకటిలో నుండి తిరిగి వచ్చెదనని వాడు నమ్మడు. 23-25వ. దుష్టుడు ఆహారమెక్కడ దొరుకునని దానికొరకు తిరుగులాడును. అంధకార దినము సమీపించుచున్నదని వానికి తెలియును. సర్వశక్తుడగు దేవునిని ధిక్కరించి మాటలాడును. శ్రమయు, వేదనయు వానిని బెదిరించగా దుష్టుని దుష్టత్వము వానిని పట్టుకొనును.

**26-35వ. మూర్ఖులైనవారు శిక్షకు పాత్రులే అని చెప్పిన ఎలీఫజు :-**

26-30వ. మూర్ఖుడు క్రొవ్వుకండలు పెరిగినవాడై పాడైన పట్టణములలో, దిబ్బలు కావలసిన యిండ్లలో నివసించెదరు. వారు భాగ్యవంతులుకారు. వారి ఆస్తి నిలువదు. వారు దేవుని నోటి ఊపిరిచేత నాశనమగుదురు. యోబు ఆలాగు మూర్ఖముగా వున్నందున తానిప్పుడు అనుభవించుచున్న శిక్షకు యోబు పాత్రుడే అని ఎలీఫజు దేవుని ప్రణాళికను ఎరుగక తప్పుగా చెప్పుచున్నాడు. 31-35వ. యోబువంటివారు మాయను నమ్మికొనగా వారి కాలము రాకముందే వారి కొమ్మువాడిపోయి ద్రాక్షచెట్టునుండి పిందెలు రాలునట్లు, ఒలీవచెట్టునుండి పువ్వులు రాలునట్లు దేవుడు వారిని రాల్చును. భక్తిహీనుల కుటుంబములు, వారు దుష్కార్యమును గర్భమున ధరించి పాపమును కనినందున వారి గుడారములు అగ్నిచేత కాల్చివేయబడునని, ఎలీఫజు యోబు విషయము తప్పుగా తలచి మాటలాడుచున్నాడు. కాని యోబు దేనిని నమ్మక, దేవునియందే తన నిరీక్షణను వుంచుకున్నాడని ఎలీఫజు గుర్తించలేదని మనము గమనించాలి.

# యోబు గ్రంథము 16వ అధ్యాయము (5+9+8=22వ.)

## అంశము :- ఎలీఫజుకు యోబు ప్రత్యుత్తరము

**1-5వ. యోబు తన ముగ్గురు స్నేహితులు బాధకే కర్తలని చెప్పుట :-** యోబు స్నేహితుల గాలిమాటలు అనేకములు విని, వారందరు ఆదరణకు కాక, బాధకే కర్తలని యోబు చెప్పుచున్నాడు. యోబు వారి స్థితిలో తానుండిన యెడల తానును వారి వైపుచూచి తల ఆడించి మాటలాడగలనని చెప్పుచున్నాడు.

**6-14వ. దేవుడే తనకు చల్లారని దు:ఖము కలిగించెనని చెప్పుట :-** 6-9వ. దేవుడు తన దేహమంతటిని పట్టుకొనినందున తన దు:ఖము చల్లారి ఉపశమనము కలుగలేదని యోబు చెప్పుచున్నాడు. దేవుని కోపము యోబు మీద పడి యోబును చీల్చగా యోబు యొక్క క్షీణత ముఖాముఖిగా యోబుకు సాక్ష్యమిచ్చుచున్నది. తన దేహమునకు శిక్షకు కారణము తెలియక దేవుడే అనుకుంటున్నాడు. మనము మనకు కలిగిన ఇబ్బందులలో ఎన్నోసార్లు అనుకొని ఉంటాము అన్నీ మన మేలుకొరకే అని గ్రహించాలి.

10-11వ. జనులు ఏకీభవించి, గుంపుకూడి, తమ నోరు తెరచి, యోబును తిట్టి చెంపమీద కొట్టుదురని యోబు చెప్పుచున్నాడు. దేవుడు తనను దుర్మార్గులకు అప్పగించి, భక్తిహీనుల వశమున ఉంచియున్నాడని యోబు చెప్పుచున్నాడు.

12-14వ. తాను నెమ్మదిగా నుంటినని, దేవుడు తనను మెడపట్టుకొని, ముక్కచెక్కలుగా, విరుగగొట్టియున్నాడని యోబు ఎలీఫజుకు చెప్పుచున్నాడు.

**15-22వ. యోబు యదార్థముగా నుండినను దేవుడు శిక్షించాడని చెప్పుట :-**

15-17వ. యోబు తన చర్మము మీద గోనెపట్ట కట్టుకొని కూర్చుండి తన ప్రార్థన యదార్థముగా నుండినను దేవుడు జవాబివ్వలేదని, ఏడ్పుచేత తన ముఖము ఎఱ్ఱబడి యున్నదని మరణాంధకారము తనమీద నిలిచియున్నదని చెప్పుచున్నాడు.

18-22వ. యోబు ప్రార్థించినను యోబుకు సాక్షియైనవాడు పరలోకములో నుండి యోబు పక్షముగా సాక్ష్యము పలుకనందున స్నేహితులు యోబును ఎగతాళి చేయుచున్నారని యోబు చెప్పుచున్నాడు. కొద్ది సంవత్సరములు గతించిన తరువాత తిరిగిరాని మార్గమున తాను వెళ్లుదునని దేవుడు స్నేహితులతో వ్యాజ్యమాడవలెనని కోరి దేవునితట్టు దృష్టియుంచి ప్రార్థించినను దేవుడు జవాబు ఇచ్చుటలేదని యోబు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 17వ అధ్యాయము (5+5+6=16వ.)

## అంశము :- యోబు ప్రాణము సమసిపోయి మరణాపేక్ష కలిగియుండుట

**1-5వ. యోబు తన ముగ్గురు స్నేహితులను గద్దించుట :-** యోబు తన ప్రాణము సమసిపోయి, సమాధి తన నిమిత్తము సిద్ధమైయున్నదని, ఎగతాళి చేయువారు తన యొద్ద చేరియున్నారని చెప్పుచున్నాడు. వారు పుట్టించు వివాదములు తన కన్నుల కెదురుగా నున్నవని, దయచేసి తన నిమిత్తము దేవునిని పూటపడుమని యోబు అడుగుచున్నాడు. దేవుడు తన ముగ్గురు స్నేహితుల హృదయమునకు జ్ఞానము మరుగుచేసియున్నాడని చెప్పుచున్నాడు.

**6-10వ. యోబు తన ముగ్గురు స్నేహితులు జ్ఞానవంతులుకారని చెప్పుట :-**

6-7వ. దేవుడు యోబును జనులలో సామెతకాస్పదముగా చేసియున్నాడని, తన కనుదృష్టి దు:ఖము చేత మందమై, తన అవయవములన్ని నీడవలె ఆయెనని చెప్పుచున్నాడు. 8-10వ. యదార్థవంతులు ఆశ్చర్యపడుదురని, నిర్దోషులు భక్తిహీనుల స్థితి చూచి కలవరపడుదురని చెప్పుచున్నాడు. అయితే నీతిమంతులు తమ మార్గమును విడువక ప్రవర్తించుదురని, నిరపరాధులు అంతకంతకు బలము నొందుదురని, తన స్నేహితులలో జ్ఞానవంతుడొక్కడైనను తనకు కనబడలేదని యోబు చెప్పుచున్నాడు.

**11-16వ. యోబు దినములు గతించి మరణమగుదునని తలంచుట :-**

11-13వ. తన దినములు గతించి, తన యోచనలు నిరర్థకమై, తన హృదయవాంఛలు భంగమాయెనని చెప్పుచున్నాడు. రాత్రి పగలని చీకటి కమ్ముట వెలుగని తన స్నేహితులు వాదించుచున్నారని చెప్పుచున్నాడు. పాతాళము తనకు ఇల్లు అనునది తన ఆశయమని చెప్పుచున్నాడు. 14-16వ. నీవు నాకు తండ్రి, తల్లి, చెల్లివని గోతితోను, పురుగుతోను మనవి చేయుచున్నానని చెప్పుచున్నాడు. నాకు నిరీక్షణాధారమేది ? నా నిరీక్షణ యెవనికి కనబడును ? పాతాళపు అడ్డకమ్ములయొద్ద ధూళిలో విశ్రాంతి దొరకునని చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 18వ అధ్యాయము (5+5+4+3+4=21వ.)

## అంశము :- షూహీయుడైన బిల్దదు రెండవసారి మాటలాడుట.

**1-5వ. బిల్దదు రెండవసారి మాటలాడుచు యోబును గద్దించుట :-** షూహీయుడైన బిల్దదు యోబును గద్దించుచు మాటలలో చిక్కుపరచుటకై యోబుచేయు ఆలోచనలు ముగించినయెడల బిల్దదు యోబుతో మాటలాడెదనని చెప్పుచున్నాడు. యోబు నిమిత్తము భూమిపాడుగా చేయబడదని, కొండ దాని స్థానము తప్పదని చివరకు భక్తిహీనుల దీపము ఆర్పివేయబడునని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు.

**6-10వ. దుష్టులను కూల్చుటకు ఆపద కాచియుండును :-** వారి గుడారములో వెలుగు అంధకారమై వారి దీపము ఆరిపోవును. వారి నడకలు అడ్డగింపబడగా వారి స్వకీయాలోచన వారిని కూల్చును. తమ కాళ్లే వారిని వలలోని ఉచ్చునకు నడిపించగా వారిని పట్టుకొనుటకై త్రోవలో పెట్టబడిన బోనులో వారు చిక్కబడెదరని బిల్దదు యోబుకు చెప్పుచున్నాడు.

**11-14వ. దుష్టులను కూల్చుటకు ఆపద కాచియుండునని చెప్పుట :-** నలుదిక్కుల కలుగు భయములు వారిని వెంటాడి తురుమును, వారి దేహ అవయవముల బలము క్షీణించిపోగా ఆపద వారిని కాచియుండి కూల్చును.

**15-17వ. దుష్టులకు శిక్ష తప్పదని చెప్పుట :-** అన్యులైనవారు దుష్టుల గుడారములో నివాసము చేయుదురు. వారి నివాస స్థలము మీద గంధకము చల్లబడును. వారి వేరులు ఎండిపోయి, వారి కొమ్మలు నరకబడగా భూమిమీద ఎవరును వారిని జ్ఞాపకము చేసికొనరని బిల్దదు యోబుతో చెప్పుచున్నాడు.

**18-21వ. భక్తిహీనులకు వారి నివాసములకు పట్టు గతి :-** జనులు వారిని వెలుగులోనుండి చీకటిలోనికి తోలుదురు. భూలోకములో నుండి వారిని తరుముదురు. ప్రజలలో వారికి కుమారులు ఉండరు. వారు నివసించిన స్థలములో తప్పించుకొనినవాడు ఒకడైనను ఉండరు. వారి తర్వాత వచ్చినవారు వారి మీద పడిన శిక్షను చూచి విస్మయమొంది చూచి దిగులుపడుదురు. నిశ్చయముగా దేవుని ఎరుగని భక్తిహీనుల నివాసములకు ఇట్టి గతి పట్టునని అందరు గ్రహించుదురు.

# యోబు గ్రంథము 19వ అధ్యాయము (6+6+4+4+4+3+2=29వ.)

## అంశము :- బిల్దదుకు యోబు రెండవసారి ప్రత్యుత్తరమిచ్చుట.

**1-6వ. మిత్రులు యోబును మాటలచేత నలుగగొట్టుచున్నారని చెప్పుట:-**

యోబును మిత్రులు తమ్మును తాము హెచ్చించుకొనుచు మాటలచేత నిందించి, నలుగగొట్టుచు బాధించుచున్నారని యోబు బిల్దదుకు ప్రత్యుత్తరమిచ్చెను. యోబు తాను దేవుని వలలో చిక్కియున్నానని మిత్రులు తెలిసికొనవలెనని యోబు మిత్రులకు చెప్పుచున్నాడు.

**7-12వ. దేవుడే యోబు ఘనతను కొట్టివేసియున్నాడని చెప్పుట :-** యోబు తన మీద బలాత్కారము జరుగుచున్నదని సహాయము నిమిత్తము మొఱ్ఱపెట్టినను తన మొఱ్ఱ అంగీకరింపబడలేదని యోబు దాటలేకుండ దేవుడు తన మార్గమునకు కంచెవేసియున్నాడని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు. దేవుడు యోబు త్రోవకు చీకటి కలుగజేసి, యోబు ఘనతను నాశనముచేసి, చెట్టును పెల్లగించినట్లు దేవుడు తన నిరీక్షణను పెల్లగించెనని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు. దేవుడు యోబు మీదికి తన కోపమును రగులబెట్టి, తనను శత్రువుగా ఎంచగా శత్రువులు యోబు గుడారము చుట్టు దిగిరని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు.

**13-16వ. యోబును బంధువులు, మిత్రులు అందరు తృణీకరించుచున్నారని చెప్పుట:-** దేవుడు యోబు యొక్క బంధువులను, నెళవరులను తనను మరచిపోవునంత దూరము చేసియున్నాడని యోబు చెప్పుచున్నాడు. యోబు యింటిలో దాసుల దృష్టికి పరదేశినై యున్నానని పనివారిని పిలువగా వారు పలుకనందున వారిని బతిమాలవలసి వచ్చెనని యోబు చెప్పుచున్నాడు.

**17-20వ. యోబును అందరు తృణీకరించుట :-** తన భార్యకు తన వాసన అసహ్యమైనదని యోబు చెప్పుచున్నాడు. బాలురు, ప్రాణస్నేహితులు, యోబును తృణీకరించి యోబు ప్రేమించినవారు కూడా యోబుమీద తిరుగబడి దూషణ మాటలు పలుకగా అందరికి అసహ్యుడనైతినని యోబు చెప్పుచున్నాడు. తన యెముకలు, మాంసము చర్మముతోను అంటుకొని చర్మము మాత్రము మిగిలియున్నదని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు.

**21-24వ. యోబు దేవునికి తన విన్నపమును తెలియజేయుట :-** దేవుని హస్తమే యోబును మొత్తినదని స్నేహితులు యోబు మీద జాలిపడవలెనని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు. దేవుడు యోబును తరుమునట్లు తన స్నేహితులును తనను తరుముచున్నారని యోబు చెప్పుచున్నాడు. యోబు తన మాటలు గ్రంథములో వ్రాయబడవలెనని, యినుప పోగరతో బండమీద చెక్కబడి సీసముతో నింపబడినట్లు నిత్యము నిలువవలెనని కోరుచున్నానని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు.

**25-27వ. యోబు తన విమోచకుడగు దేవుడు సజీవుడని చెప్పుచున్నాడు :-** యోబు తన విమోచకుడు సజీవుడని, శ్రమల కాలము తరువాత ఆయన భూమి మీద నిలుచునని తన చర్మము చీకిపోయి అంతరింద్రియములు కృశించిన తరువాత శరీరముతో యోబు దేవుని చూచెదనని తాను ఎరుగుదునని చెప్పుచున్నాడు. తన మట్టుకు తానే చూచెదనని యోబు తన కన్నులార ఆయనను చూచెదనని చెప్పుచున్నాడు.

**28-29వ. యోబు స్నేహితులతో చెప్పుట :-** యోబుకు ఈలాగు జరుగుటకు యోబు పాపమే కారణమని స్నేహితులు ఎట్లు తరిమెదమా అని తలంచుచున్నారని యోబు చెప్పుచున్నాడు. దేవునికి భయపడవలెనని లేనియెడల దేవుడు తీర్పుతీర్చి స్నేహితులను శిక్షించునని తెలిసికొనవలెనని యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 20వ అధ్యాయము (3+8+7+11=29వ.)

## అంశము :- జోఫరు యోబుతో రెండవసారి మాటలాడుట.

**1-3వ. యోబుతో రెండవసారి జోఫరు మాటలాడుట :-** యోబు జోఫరు మాటలతో తృప్తిచెందక జోఫరును అవమానపరచు రీతిగా జవాబిచ్చాడు. ఆ జవాబు విని, ప్రత్యుత్తరము సిద్ధపరచి జోఫరు యోబుతో చెప్పాడు.

**4-11వ. దుష్టులు, భక్తిహీనులు వారెన్నటికిని నుండకుండ నశించుదురు :-** ఆదినుండి నరులు భూమి మీద నుంచబడిన కాలము మొదలుకొని దుష్టులకు భక్తిహీనులకు విజయము, సంతోషము కొద్దికాలమే అని జోఫరు యోబుతో చెప్పాడు. దుష్టులకు ఘనత ఆకాశమంత యెత్తుగా కలిగి మేఘములంత యెత్తుగా వారెత్తబడినను తమ మలము నశించురీతిగా వారు నశించుదురని యోబుతో జోఫరు చెప్పుచున్నాడు. కల, రాత్రి, స్వప్నము దాటిపోవునట్లు వారు తరిమి వేయబడుదురని, వారిని చూచిన కన్ను ఇకను వారిని చూడదని, వారి స్థలము మరి ఎప్పుడును కనబడదని వారి బలము వారితో కూడ మంటిలో పండుకొనునని జోఫరు యోబుతో చెప్పుచున్నాడు.

**12-18వ. దుష్టుల చెడుతనము భద్రము చేయబడి ఒకరోజు బయలుపడును:-** దుష్టులు, భక్తిహీనుల చెడుతనము నోటికి తియ్యగా నుండి దానిని పోనియ్యక నోట భద్రము చేసికొనినను వారి ఆహారము పులిసిపోయి, నాగుపాముల విషమగునని జోఫరు యోబుతో చెప్పాడు. వారు అన్యాయముగా ధనమును మింగినను వారి కడుపులోనుండి దేవుడు దాని కక్కించును. దేనికొరకు వారు ప్రయాసపడి సంపాదించిరో సంతోషముండదు. దానిని వారు అనుభవింపరు.

**19-29వ. దుష్టులైన నరులకు దేవుని వలన నియమింపబడినది శిక్షయే :-** 19-23వ. దుష్టులైన నరులకు బీదలను ముంచి బలాత్కారముచేత వారి యింటిని ఆక్రమించుకొనినను దానిని కట్టి పూర్తిచేయలేరని జోఫరు చెప్పుచున్నాడు. వారు ఆశించిన వస్తువులలో ఒకదానిచేతనైనను తమ్మును తాము రక్షించుకొన జాలరని క్షేమస్థితిలోనే వారు ఇబ్బంది పడుదురని దేవుడు వారి మీద తన కోపాగ్ని కురిపించునని చెప్పుచున్నాడు.

24-29వ. దుష్టుల మీదికి మరణ భయము వచ్చును. అగ్ని వారిని వారి గుడారములో మిగిలిన దానిని కాల్చివేయును. దేవునివలన దుష్టులైన నరులకు నియమింపబడిన స్వాస్థ్యము ఇది అని జోఫరు యోబుతో చెప్పి తన మాటలు ముగించుచున్నాడు.

# యోబు గ్రంథము 21వ. అధ్యాయము (6+10+5+5+8=34వ.)

## అంశము :- జోఫరుకు యోబు రెండవసారి ప్రత్యుత్తరము

**1-6వ. రెండవసారి యోబు తనను గూర్చి స్నేహితులకు చెప్పుట:-** యోబును ఆదరించునట్లు స్నేహితులు మాటలాడుచున్నారని యోబు గుర్తించి వారు ఆతురపడకూడదని వారికి ప్రత్యుత్తరమిచ్చుచున్నాడు. స్నేహితులు తన మాటలను జాగ్రత్తగా వినిన తరువాత అపహాస్యము చేయవచ్చునని యోబు చెప్పుచున్నాడు. తాను మనుష్యులతోకాక దేవునికి మొరపెట్టుచున్నానని స్నేహితులు గుర్తించాలని యోబు చెప్పుచున్నాడు.

**7-16వ. భక్తిహీనులకు సంభవించునది :-**

7-10వ. ఎందుకు భక్తిహీనులు వృద్ధులై బలాభివృద్ధినొందుట వారి కుటుంబము క్షేమముగా నుండి స్థిరపరచబడుట జరుగుచున్నదని తెలిసికొనగోరుచున్నాడు. వారి గొడ్లు ఆవులు ఈచుకపోక ఈనును. భక్తిహీనుల పిల్లలు స్వరమండలములను, తంబుర పట్టుకొని వాయించుచు క్షేమముగా నుందురు. 11-13వ. భక్తిహీనులు శ్రేయస్సు కలిగి తమ దినములు గడిపినను ఒక్క క్షణములోనే పాతాళమునకు దిగిపోవుదురు. 14-16వ. భక్తిహీనులు నీ మార్గములను గూర్చిన జ్ఞానము మాకక్కరలేదు, మమ్మును విడిచిపొమ్మని దేవునితో చెప్పుదురు. మేము ఆయనను సేవించుటకు సర్వశక్తుడగువాడెవడు అని ఆయనకు ప్రార్థనచేయుట చేత మాకేమి లాభము కలుగును అని భక్తిహీనులు చెప్పుదురు.

**17-21వ. భక్తిహీనులకు సంభవించు కొన్ని :-** దేవుడు భక్తిహీనుల పాపమును దాచిపెట్టి వారు ప్రతిఫలమును అనుభవించునట్లు చేయును. దేవుడు భక్తిశూన్యుల మీదికి ఆపదవచ్చుట వారి దీపము ఆర్పివేయబడుట అరుదుగదా అని తలంచుట తప్పని గమనించాలని చెప్పుచున్నాడు. భక్తిహీనులు తుపాను ఎదుట కొట్టుకొనిపోవు చెత్తవలెను గాలి యెగురగొట్టు పొట్టువలెను ఉండునట్లు ఆయన కోపపడి వారికి వేదనలు నియమించి వారు అనుభవించునట్లు దేవుడు వారికి ప్రతిఫలమిచ్చును. భక్తిహీనులు సర్వశక్తుడగు దేవున కోపాగ్నిని త్రాగగా తమ జీవితకాలము సమాప్తమగును. భక్తిహీనులు పోయిన తరువాత తమ ఇంటివారికి చింత ఏమియు వుండదని యోబు జోఫరుకు చెప్పుచున్నాడు.

**22-26వ. భక్తిహీనులకు సంభవించు మరికొన్ని :-** దేవుడు పరలోకవాసులకు తీర్పు తీర్చును. ఒకడు సంపూర్ణ సౌఖ్యమును నెమ్మది కలిగియుండినను, మరొకడు ఎన్నడును క్షేమము నెరుగక మనోదు:ఖము గలవాడైయుండినను వారందరు సమానముగా మంటిలో పండుకొందురు. పురుగులు వారిద్దరి శరీరములను కప్పును.

**27-34వ. భక్తిహీనులకు సంభవించు దానిని గూర్చి యోబు తన స్నేహితులకు చెప్పుట:-** భక్తిహీనులు నివసించిన గుడారము ఎక్కడ ఉన్నదని స్నేహితులు అడుగుట యోబు గమనించి వారి తలంపులు ఎరుగుదునని స్నేహితులకు చెప్పుచున్నాడు. స్నేహితులు తన మీద అన్యాయముగా మాటలాడుచున్నారని యోబు చెప్పుచున్నాడు. దుర్జనులు ఉగ్రత దినమందు పాతాళమునకు తోడుకొని పోబడుదురని స్నేహితులు గుర్తించలేదని యోబు చెప్పుచున్నాడు. భక్తిహీనుల ప్రవర్తననుబట్టి సమాధికి భక్తిహీనులు తేబడుదురని సమాధి వారిని కావలి కాయునని యోబు చెప్పుచున్నాడు. లెక్కలేనంతమంది భక్తిహీనులగు మనుష్యులు వారికి ముందుగాను, వారి వెంబడి సమాధికి పోయిరని స్నేహితులు గుర్తించవలెనని యోబు చెప్పుచున్నాడు. నిరర్థకమైన మాటలతో స్నేహితులు తనను ఓదార్చలేరని యోబు చెప్పుచు తన మాటలు ముగించుచున్నాడు.

# యోబు గ్రంథము 22వ అధ్యాయము (4+7+3+6+10=30వ.)

## అంశము :- ఎలీఫజు మూడవసారి మాటలాడుట

**1-4వ. యోబు తాను నీతిమంతుడనని తలంచుట దేవునికి సంతోషము కాదని ఎలీఫజు చెప్పుట :-** యోబు తాను నీతిమంతుడనని బుద్ధిమంతుడని తలంచుకొనుచున్నాడని, నరులు దేవునికి కాక తమమట్టుకు తామే ప్రయోజనకారులైయున్నారని యోబు తెలిసికొనవలెనని ఎలీఫజు చెప్పుచున్నాడు.

**5-11వ. యోబు చెడుతనము గొప్పదని ఎలీఫజు చెప్పుట :-** 5-7వ. యోబు ఏమియు ఇయ్యకయే తన సోదరుల యొద్ద తాకట్టు పుచ్చుకొనలేదు. కానీ ఎలీఫజు తప్పుగా తలంచుచున్నాడు. వస్త్రహీనుల బట్టలు తీసికొనలేదు. దప్పిచేత ఆయాస పడినవారికి, ఆకలి గొనినవానికి అన్నము పెట్టలేదని ఎలీఫజు తప్పుగా తలంచి మాటలాడుచున్నాడు. యోబు చెడుతనము దోషములు మితిలేనివని ఎలీఫజు తలంచి తప్పుగా తలంచుచున్నాడు.

8-9వ. బాహుబలముగల మనుష్యునికే భూమి ప్రాప్తించును. ఘనుడని యెంచబడినవాడు దానిలో నివసించును. విధవరాండ్రను వట్టిచేతులతో పంపివేసి తండ్రిలేనివారి చేతులు విరుగగొట్టితివి అని ఎలీఫజు తప్పుగా తలంచి మాటలాడు చున్నాడు. 10-11వ. కావున యోబు తనను ముంచబోవు ప్రళయ జలముల బోనులో చిక్కుకొని ఆకస్మిక భయముతో యోబు బెదరుచున్నాడని ఎలీఫజు చెప్పుచున్నాడు.

**12-14వ. దేవుడు మహోన్నతుడు కనుక సమస్తమును తెలిసినవాడు :-** దేవుడు ఆకాశమంత మహోన్నతుడు, నక్షత్రముల ఔన్నత్యము గొప్పది. దేవునికి తెలియదని యోబు అనుకొనుచున్నాడని తప్పుగా యోబును గూర్చి ఎలీఫజు తలంచుచున్నాడు.

**15-20వ. దుష్టుల మార్గమును అనుసరించవద్దని యోబుకు ఎలీఫజు చెప్పుట:-** యోబు పూర్వమునుండి దుష్టులు అనుసరించిన మార్గమును అనుసరించుచున్నాడని అటువంటివారు అకాలముగా ఒక నిముషములో నిర్మూలమైరి అని యోబును వుద్దేశించి ఎలీఫజు తప్పుగా పలుకుచున్నాడు. అట్టివారి పునాదులు జలప్రవాహమువలె కొట్టుకొని పోయెనని యోబును వుద్దేశించి ఎలీఫజు తప్పుగా చెప్పుచున్నాడు. 17-18వ. దేవుడు భక్తిహీనుల యిండ్లను మంచి పదార్థములతో నింపినను మాయొద్దనుండి తొలగిపొమ్మని దేవుడు మాకు ఏమి చేయునని వారు అందురు. కాని యోబు భక్తిహీనుల ఆలోచన నాకు దూరమై యుండునుగాక అని పలుకుచున్నాడు.

19-20వ. దేవునికి విరోధులగు భక్తిహీనులు నిశ్చయముగా నిర్మూలమై వారి సంపదను అగ్ని కాల్చివేసెనని యోబు తాను ఎరుగుదునని ఎలీఫజు చెప్పుచున్నాడు.

**21-30వ. యోబు దుర్మార్గమును దూరముగా తొలగించి, సర్వశక్తుని వైపు తిరిగిన యెడల అభివృద్ధి పొందెదవని ఎలీఫజు చెప్పుట :-**

21-25వ. దేవునితో సహవాసము చేసి దేవుని మాటలను హృదయములో ఉంచుకొనిన యెడల నీకు సమాధానము మేలు కలుగును. ఆయన మాటలను ఉపదేశమును అవలంభించి సర్వశక్తునివైపు తిరిగి నీ గుడారములలో నుండి దుర్మార్గమును దూరముగా తొలగించిన యెడల సర్వశక్తుడు యోబుకు అపరంజిగాను ప్రశస్తమైన వెండిగాను ఉండునని ఎలీఫజు చెప్పుచున్నాడు. 26-28వ. యోబు నీవు దేవునికి ప్రార్థనచేసి మ్రొక్కుబళ్ళు నీవు చెల్లించిన దేవుడు నీ మనవిని ఆలకించగా దేవునియందు ఆనందించెదవు. దేవుని తట్టు నీ ముఖము ఎత్తెదవు అని యోబుతో హితవు చెప్పుచున్నాడు. అప్పుడు యోబు నీవు దేనినైన యోచన చేయగా నీ మార్గములమీద వెలుగు ప్రకాశించి అది నీకు స్థిరపరచబడును అని ఎలీఫజు చెప్పుచున్నాడు. 29-30వ. యోబు మీదు చూచువాడుకాదు. దేవునియందే నిరీక్షించును కనుక వినయముగల తాను దేవుని వలన విడిపింపబడునని యోబు తలంచుచున్నాడని ఎలీపజు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 23వ అధ్యాయము (7+5+5=17వ.)

**అంశము :- దేవునియందు విశ్వాసముంచిన యోబు.**

**1-7వ. న్యాయాధిపతియైన దేవునితో మాటలాడవలెనని కోరుకొనిన యోబు :-**

1-5వ. యోబు మొరలిడుచు దేవుని నివాస స్థానమును కనుగొని ఆయన సన్నిధిని తన వ్యాజ్యమును విశదపరచెదనని దేవుడు ఏమి ప్రత్యుత్తరముగా పలుకునో తెలిసికొనగోరాడు. 6-7వ. దేవుడు తన అధిక బలముచేత వ్యాజ్యమాడక తన మనవిని ఆలకించునని తలంచాడు. యోబు తాను యదార్థవంతుడు కనుక ఎన్నటికిని న్యాయాధిపతియైన దేవుని వలన శిక్షనొందక పోవుదునని తలంచాడు.

**8-12వ. యోబును దేవుడు శోధించుచున్నాడని యెరిగి నలుదిశలకు వెళ్ళి దేవుని వెదకుచున్నాడు :-**

8-9వ. నేను తూర్పు దిశకు, పడమటి దిశకు వెళ్లినను ఉత్తర దిశకు పోయినను ఆయన కనబడుట లేదని గుర్తించాడు. ఆయన పనులు జరిగించు దక్షిణ దిశకు ఆయన ముఖము త్రిప్పుకొనియున్నాడు కనుక ఆయనను కనుగొనలేనని తెలిసికొన్నాడు. 10-12వ. యోబు తన అడుగుజాడలు దేవుని మార్గము ననుసరించి విడువక నడచినవని దేవునికి తెలియునని దేవుడు తనను శోధించిన తరువాత తాను సువర్ణమువలె కనబడుదునని చెప్పుచున్నాడు.

**13-17వ. యోబును దేవుడు శోధించుచున్నాడు గనుక యోబు బాధలు దేవుడు ఎరిగిననియే :-**

13-15వ. దేవుడు ఏకమనస్సుగలవాడై ఆయన తనకిష్టమైనది ఏదో అదే చేయును గనుక ఆయనను ఎవరు మార్చలేరు. 14-15వ. దేవుడు తనకు విధింపబడిన దానిని నెరవేర్చును. 16-17వ. సర్వశక్తుడైన దేవుడు తన హృదయమును క్రుంగజేసి కలవరపరచగా గాఢాంధకారము తనను కమ్మియుండినను తాను నాశనము చేయబడి యుండలేదని యోబు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 24వ అధ్యాయము (6+6+5+8=25వ.)

**అంశము :- దుష్టులు తాత్కాలికముగా వర్ధిల్లినను తుదకు పాతాళమునకు పోవుదురు.**

**1-6వ. దుష్టులు, దరిద్రులు, బీదల స్థితి :-** 1-3వ. దుష్టులు సరిహద్దు రాళ్లను తీసివేసి ఆక్రమించుకొని అక్రమముగా మందలను మేపుచున్నారు. విధవరాలి యెద్దును తాకట్టుగా తీసికొనుచున్నారు. అయినను సర్వశక్తుడగు దేవుడు ఎందుచేత చూడకున్నాడని యోబు చింతించుచున్నాడు. 4-6వ. దుష్టులగువారు మార్గములోనుండి దరిద్రులను తొలగించివేయుచున్నందున, దేశములోని బీదలు ఎవరికిని తెలియకుండ దాగవలసివచ్చినదని పొలములో వారు తమ కొరకు గడ్డికోసికొని, ద్రాక్ష తోటలలో పరిగ ఏరుకొనుచున్నారని యోబు చెప్పుచున్నాడు.

**7-12వ. దరిద్రులు వస్త్రహీనులై తిరుగులాడుదురు :-** దరిద్రులు బట్టలు లేక రాత్రి అంతయు, చలిలో వస్త్రహీనులై పండుకొనియుందురని చెప్పుచున్నాడు. దరిద్రుల యొద్ద తాకట్టు పుచ్చుకొను వారున్నందున దరిద్రులు వస్త్రహీనులై బట్టలులేక తిరుగులాడుదురు. 11-12వ. ఆకలిగొని పనలను మోయుచు వారు తమ యజమానుల గోడలలోపల నూనెగానుగలను ఆడించి, ద్రాక్షగానుగలను త్రొక్కుచున్నను దప్పిగలవారై యుందురు. గాయపరచబడిన జనులు పట్టణములో మూలుగుచు మొఱ్ఱపెట్టినను జరుగునది అక్రమమని దేవుడు ఎందుకు ఎంచుటలేదని దేవుని యోబు ప్రశ్నించుచున్నాడు.

**13-17వ. తప్పు చేయువాడికి శిక్ష తప్పదు :-** 13-14వ. తెల్లవారునప్పుడు నరహంతకుడులేచి దరిద్రులను చంపును. రాత్రియందువాడు దొంగతనము చేయుచు వెలుగుమీద తిరుగబడి వెలుగు త్రోవలలో నిలువరని యోబు చెప్పుచున్నాడు. 15-17వ. వ్యభిచారి ఏ కన్నైనను తనను చూడదనుకొని తన ముఖమునకు ముసుకు వేసికొని సందె చీకటికొరకు కనిపెట్టుచుండును. వారు వెలుగు చూడనొల్లరు. దానికి శిక్షయైన గాఢాంధకార భయము ఎట్టిదైనది వారికి తెలిసియున్నను లెక్కచేయకయున్నారు.

**18-25వ. పలు రకములగు శిక్షలు :-** అనావృష్టిచేతను ఉష్ణము చేతను మంచు నీళ్లు ఎగసిపోవునట్లు పాతాళము పాపము చేసినవారిని పట్టుకొనును.

# యోబు గ్రంథము 25వ అధ్యాయము (3+3=6వ.)

## అంశము :- నరుడు ఆయన దృష్టికి పవిత్రుడు కానేరడు.

**1-3వ. షూహీయుడైన బిల్దదు యోబుకు జవాబు :-** బిల్దదు యోబుకు ఈలాగున ప్రత్యుత్తరమిచ్చెను. దేవుడు అధికారమును భీకరత్వమును ఆయనకు తోడైయున్నవని చెప్పుచున్నాడు. ఆయన తన ఉన్నత స్థలములలో నుండి సమాధానము కలుగజేయునని చెప్పుచున్నాడు. ఆయన వుద్దేశమును నెరవేర్చుటకు లెక్కలేనంతమంది సైన్యము ఆయనకు వున్నారు. ఆయన వెలుగును అందరిమీద వుదయింపచేయువాడని యోబు చెప్పుచున్నాడు.

**4-6వ. నరుడు ఆయన దృష్టికి పవిత్రుడు, నీతిమంతుడు కాలేదు :-** దేవుని నీతితో పోల్చుటకు నరుడు దేవుని దృష్టికి నీతిమంతుడు ఏ విధముగా చూచినను కాలేడు. పాపపు స్వభావముగల మానవురాలైన స్త్రీకి పుట్టినవాడు సంపూర్ణ పవిత్రుడైన దేవుని దృష్టికి ఎట్లు చూచినను శుద్ధుడు కాలేడని బిల్దదు యోబును ఒప్పించుటకు ప్రయత్నించుచున్నాడు. ఆయన దృష్టికి దేవుని కాంతి ముందు చంద్రుని కాంతి ఎన్నికలేనిదని, నక్షత్రములుగా చెప్పబడు దూతలైనను పరిశుద్ధమైనవారుకారని బిల్దదుకు యోబు చెప్పుచున్నాడు. యెషయా 6వ అధ్యాయములో దూతలలో ముఖ్యులగు ఆరు రెక్కలుగల సెరాపులు రెండు రెక్కలతో తమ ముఖమును, రెండు రెక్కలతో తమ శరీరమును, రెండు రెక్కలతో తమ కాళ్లను కప్పుకొని మందిరపు గడప కమ్ములు అదురునట్లు ఆయన పరిశుద్ధుడని పలుకుచున్నారు. మరి నిశ్చయముగా పాపపు స్వభావముగల మానవురాలైన పాపాత్మురాలైన స్త్రీయగు ఆది తల్లియైన అవ్వకు పుట్టినవాడు, పురుగువంటి నరుడు ఆయన దృష్టికి ఎప్పుడైనను ఏరీతిగా పవిత్రుడు కాగలడని బిల్దదు ప్రశ్నించుచున్నాడు. ఎందుకనగా యోబు తాను పవిత్రుడనని తలంచినందుకు అది సరికాదని బిల్దదు యోబును ఒప్పించుటకు ప్రయత్నముగా ఈలాగు చెప్పుచున్నాడు. కాని యోబు తానేమీ పాపము చేయలేదని అభిప్రాయము కలిగియున్నందున ఆ ముగ్గురు స్నేహితులు ఇంక మాటలాడుట వలన యోబును ఒప్పించలేమని మౌనముగా వుండిరి. వారు యోబును ఓదార్చుటకు వచ్చి చివరకు యోబుకు పరీక్షగా శ్రమలువచ్చినవని దేవుని వుద్దేశమును గుర్తించలేక యోబు పాపమును బట్టి శ్రమలు వచ్చినవని యోబుకు తప్పుగా సలహా ఇచ్చిరి. మనము కూడా దేవుని చిత్తమెరుగక ఈలాటి సలహాలు ఎప్పుడును ఇవ్వరాదు.

ఈ అధ్యాయములోని సారాంశమంతయు 4వ వచనములో వున్నట్టు నరుడు దేవుని దృష్టికి నీతిమంతుడు కాలేదని గుర్తించి పాపిని అని దేవుని దగ్గర ఒప్పుకొని కలువరిలో క్రీస్తు కార్చిన రక్తములో పాపములను కడుగుకొని పాపక్షమాపణ పొందాలి. అంతేకాని స్త్రీకి పుట్టినవాడు ఆయన దృష్టికి శుద్ధుడుకాగలడని తలంచరాదు. ఈ గ్రంథమును చదువు నీవు అటువంటి అనుభవము కలిగి వున్నావో లేదో ఒకసారి నిన్ను నీవు పరీక్షించుకో. అటువంటి స్వచ్ఛమైన అనుభవము లేదని నీ మనసాక్షి నీకు చెప్పుచున్నయెడల ఇప్పుడైనను ఆలాగు దేవుని అడిగి పాప క్షమాపణ పొందాలి.

# యోబు గ్రంథము 26వ అధ్యాయము (4+5+5=14వ.)

## అంశము :- దేవుని బలము ఎంతైనది గ్రహింపగలవాడెవడు లేడు.

**1-4వ. యోబు బిల్దదుకిచ్చిన ప్రత్యుత్తరము :-** 1-2వ. అప్పుడు యోబు ఈలాగున ప్రత్యుత్తరమిచ్చెను. యోబు బాహువులో శక్తి బలములేనివాడై యుండగా బిల్దదు మాటలు ఏమి సహాయము చేసి తనను రక్షించలేదని యోబు చెప్పుచున్నాడు. 3-4వ. జ్ఞానము లేని తనకు ఆలోచన చెప్పి చక్కగా వివరించవలసిన బిల్దదు దేవుని యెదుట ఆలాగు చేయలేదని యోబు చెప్పుచున్నాడు.

**5-9వ. దేవుడు భూమ్యాకాశములను సృజించిన వివరము :-**

5-6వ. భూమి యొక్క జలముల క్రిందను పాతాళమును నాశన కూపము బట్టబయలుగా తెరువబడియున్నదని బిల్దదు అభిప్రాయము తనకు తెలుసునని యోబు చెప్పి దేవుని గురించి మరికొన్ని విషయములను యోబు చెప్పుచున్నాడు. 7-9వ. శూన్య మండలము పైనున్న ఆకాశ విశాలము క్రింద భూమిని దేవుడు వ్రేలాడచేసి భూమిపైన మేఘములలో నీళ్లను బంధించి వుంచాడని తనకు తెలియునని యోబు బిల్దదుతో చెప్పుచున్నాడు. భూమి మీద మేఘమును వ్యాపింపజేసి ఆయన తన సింహాసనపు కాంతిని మరుగుపరచాడని దేవుని గొప్పతనమును గూర్చి యోబు బిల్దదుకు చెప్పుచున్నాడు.

**10-14వ. జలములకు హద్దు నియమించిన దేవుని బలము :-** 10-12వ. వెలుగు చీకటుల సరిహద్దుల వరకు అనగా భూమి యొక్క సరిహద్దు వరకు దేవుడు జలములకు హద్దునియమించెనని దేవుడు గద్దింపు ఆకాశవిశాల స్తంభములను విస్మయమొంది అదరచేయునని దేవుడు తన బలము వివేకము వలన సముద్రమును రేపి రాహాబును పగులగొట్టునని యోబు చెప్పుచున్నాడు. 13-14వ. ఆయన ఊపిరి విడువగా ఆకాశ విశాలములకు అందము వచ్చును. ఆయన హస్తము పారిపోవు మహాసర్పమగు సాతాను అను అపవాదిని పొడిచెను. ఇవన్నియు ఆయన కార్యములలో స్వల్పములు. గర్జనలు చేయు ఆయన మహాబలము ఎంతైనది గ్రహించుట ఎవరికిని సాధ్యము కాదు. దీని అంతటి సారాంశమేదనగా యోబును దేవుడు శ్రమల ద్వారా పరీక్షించుచున్నాడని తన స్నేహితులు గుర్తించక లోకపద్ధతిలో వారు మాటలాడుచున్నారని వారికి గుర్తు చేయుచున్నాడు.

# యోబు గ్రంథము 27వ అధ్యాయము (6+7+5+5=23వ.)

## అంశము :- యోబు యదార్థుడుగా నిలిచియుండ తీర్మానించుకొనుట

**1-6వ. యోబు తన యదార్థతను విడువక మరణమగువరకు గట్టిగా పట్టుకొందునని తీర్మానించుకొనుట :-** 1-4వ. సర్వశక్తుడగు దేవుడు తన ప్రాణమును వ్యాకులపరచాడని దేవుని ఆత్మ చెప్పు మాటలే నిశ్చయముగా తన పెదవులు పలుకుచున్నవని తాను మోసమును, అబద్ధమును పలుకుటలేదని యోబు చెప్పుచున్నాడు. 5-6వ. తన ప్రవర్తన అంతటిలో తన హృదయము తనను నిందించుట లేదు కనుక తన నీతిని విడువక, వారు చెప్పినది న్యాయమని ఒప్పుకొనననని యోబు చెప్పుచున్నాడు.

**7-13వ. దుష్టులకు బాధ కలుగునప్పుడు దేవుడు వాని మొఱ్ఱవినడు :-**7-9వ. యోబుకు శత్రువులైన వారు దుష్టులుగా దేవునికి కనబడుచున్నందుకు దేవుడు వానికి బాధకలుగలుగా చేసి, వాని ప్రాణము తీసి వేయునప్పుడు భక్తిహీనునికి ఆధారమేమియు లేకుండును. వాడు దేవునికి ప్రార్థన చేయలేదు, దేవుడు వాని మొఱ్ఱవినక వానిని కొట్టివేయును. 10-13వ. సర్వశక్తుడగు దేవుడు చేయు క్రియలను దాచిపెట్టక వారికి గుర్తు చేయుచున్నాడు. దేవుని వలన భక్తిహీనులకు నియమింపబడిన భాగము వారు కొట్టివేయబడుటయే అని చెప్పుచున్నాడు.

**14-18వ. దుష్టులను దేవుడు ఇబ్బందుల పాలుచేయును :-** 14-15వ. భక్తిహీనులగు వారి సంతానమునకు చాలినంత ఆహారము దొరకదు. వారిలో మిగిలినవారు తెగులు వలన చచ్చి పాతిపెట్టబడినను వారి విధవరాండ్రు రోదనము చేయకుందురని యోబు చెప్పుచున్నాడు. 16-18వ. ధూళి అంత విస్తారముగా వారు ధనమును పోగుచేసి, విస్తారముగా వస్త్రములను సిద్ధపరచుకొనినను వారు దానిని అనుభవించలేరని యోబు చెప్పుచున్నాడు.

**19-23వ. దుష్టులను దేవుడు ఇబ్బందులలోనే మరణమునకు అప్పగించుట :-** 19-20వ. వారు ధనముగలవారై పండుకొందురు గాని రాత్రివేళ తుఫాను వారిని ఎత్తికొనిపోవునని యోబు చెప్పుచున్నాడు. 21-23వ. తూర్పు గాలి వారిని కొనిపోగా వారు సమసిపోవుదురు. అది వారి స్థలములో నుండి వారిని ఊడ్చివేయగా వారు తప్పించుకొనగోరి పారిపోయినను వారు లేకపోవుదురు.

# యోబు గ్రంథము 28వ అధ్యాయము (6+5+6+6+5=28వ)

## అంశము :- జ్ఞానము దేవుని యొద్ద తప్ప ఎక్కడను దొరకదు.

**1-6వ. యోబుకు దేవుడు తెలిపిన జ్ఞానముతో ప్రకృతిలోగల సంపదను యోబు పొందగలడు:-** 1-3వ. వెండికి సువర్ణమునకు గనులు గలవు. ఇనుమును, భూమ్యంతముల వరకు సంచరించి గాఢాంధకారములోను మరణాంధకారములో ఉండు రత్నములను వెదకుదురు.

4-6వ. జనులు తిరుగు స్థలములకు చాలా దిగువగా మనుష్యులు సొరంగము త్రవ్వుచు దానిలో నున్న సువర్ణమయమైన నీలరత్న రాళ్లను సంపాదింతురు. భూమి నుండి పుట్టు ఆహారమును తిందురు.

**7-11వ. యోబుకు దేవుడు తెలిపిన ప్రకృతిలో గల మరికొన్ని సంపదలు :-** 7-8వ. సింహముకాని, జంతువులు నడవని మార్గమున పక్షినైనను తెలియని మార్గమున కొండగుహలలోనికి వెళ్లి అందులోని సంపదను మనుషులు బయటికి తీయుదురు.

9-11వ. మనుష్యులు ఏ లోహము ఎక్కడ వున్నది తెలిసికొని పర్వతములలోను వాటి బండలలోను బాటలు కొట్టుదురు. వారి కన్ను అమూల్యమైన ప్రతి వస్తువును చూచును. మరుగైయున్న వస్తువును వారు వెలుగులోనికి తెప్పించుదురు.

**12-17వ. దైవజ్ఞానము దేవునియొద్ద తప్ప మరి ఎక్కడను దొరకదు :-** 12-14వ. అయితే మనుష్యులు జ్ఞానము ఎక్కడ దొరుకునని ప్రాణాలున్న దేశములో సముద్ర అగాధములోను వెదకినను కనుగొనలేరు. 15-17వ. దైవజ్ఞానము ఓఫీరు బంగారము, గోమేధికము, నీలమునకైనను, సువర్ణమైనను, స్ఫటికమైనను, ప్రశస్తమైన బంగారు నగలైనను దానితో సాటికావు.

**18-23వ. కోరతగిన జ్ఞాన సంపాద్యము :-** 18-20వ. జ్ఞాన సంపాద్యము పగడములు ముత్యములకెంపు, కూషుదేశపు పుష్యరాగము, శుద్ధ సువర్ణములకన్న కోరతగినది. అట్టిన జ్ఞానము, వివేచన దొరకు స్థలమెక్కడ నున్నదని దేవుని అడిగి తెలిసికొనాలి. యాకో 3:17-18వ.లో పైనుండి వచ్చు జ్ఞానము మొదట పవిత్రమైనది, సమాధానకర మైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను ఫలములతోను నిండుకొని నీతిఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడునది. అట్టి

దైవజ్ఞానమునందు మనము లక్షముంచవలెనని నేర్చుకొందము. 21-23వ. దేవునికి దాని మార్గమును స్థలము తెలియును కనుక ఆయనను అడిగి పొందాలి.

**24-28వ. యెహోవాయందలి భయభక్తులే కోరదగిన జ్ఞానము :-** 24-25వ. దేవుడు భూమ్యంతముల వరకు చూచుచు ఆకాశము క్రింది ఉన్న దానిని అంతటిని తెలిసికొన్నవాడు. గాలికి ఇంత బరువు ఉండవలెనని ఆయన నియమించి జలములకు ఇంత కొలతయని ఆయన వాటిని కొలిచినవాడు. 26-28వ. వర్షమునకు కట్టడ నియమించినప్పుడు ఉరుముతో కూడిన మెరుపునకు మార్గము ఏర్పరచి బయలుపరచెను. వీటన్నిటిని బట్టి యెహోవాయందలి భయభక్తులే జ్ఞానమునకు మూలమని దుష్టత్వము విడచుటయే వివేకమని దేవుడు నరులకు సెలవిచ్చెనని యోబు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 29వ అధ్యాయము (5+5+6+4+4=25వ.)

**అంశము :- యోబు దేవుడు తనకిచ్చిన ఆస్తిని జ్ఞాపకము చేసికొనుచున్నాడు**

**1-6వ.** దేవుడు గతములో తనకిచ్చిన ఆస్తిపాస్తులను జ్ఞాపకము చేసికొనుట :-

1-3వ. యోబుకు దేవుడు పూర్వకాలమున నున్నట్లు దేవుడు కాపాడుచుండిన దినములలో ఉన్నట్లు తాను వున్న యెడల ఎంతో మేలని, అప్పుడు దేవుని దీపము తన తలకుపైగా ప్రకాశించగా దేవుని తేజమువలన యోబు చీకటిలో తిరుగులాడు చుంటినని చెప్పుచున్నాడు. 4-6వ. సర్వశక్తుడు యోబుకు తోడైయుండగా తన పిల్లలు తన చుట్టునుండిరి. యోబు తన పరిపక్వ దినములలో ఉండినట్లు వుండిన యెడల ఎంతో మేలని తలంచుచున్నాడు. అప్పుడు దేవుని రహస్యము తన గుడారమునకుపైగా నుండెనని తాను పెట్టిన అడుగెల్ల నేతిలో పడెనని తన నిమిత్తము నూనె ప్రవాహముగా పారెనని యోబు చెప్పుచున్నాడు.

**7-11వ. దేవుడు గతములో యోబుకిచ్చిన స్థితిని బట్టి అందరిచేత యోబు ఘనపరచ బడ్డాడు :-** 7-8వ. పట్టణపు గుమ్మమునకు యోబు వెళ్ళినప్పుడు రాజవీధిలో యవనులు ముసలివారు నన్ను చూచి లేచి నిలువబడిరని యోబు చెప్పుచున్నాడు.

9-11వ. అధికారులు, ప్రధానులు మాటలాడక ఊరుకొనగా తన సంగతి చెవినిబడిన ప్రతివాడు తనను అదృష్టవంతునిగా ఎంచి సాక్ష్యమిచ్చిరని యోబు చెప్పుచున్నాడు.

**12-17వ. గతములో యోబు చేసిన క్రియలను బట్టి అందరిచేత ఘనపరచబడ్డాడు :-**

12-14వ. దీనులను, తండ్రిలేనివారిని, నశించుటకు సిద్ధమైయున్నవారిని, విధవరాండ్ర హృదయమును సంతోషపెట్టితినని యోబు చెప్పుచున్నాడు. యోబు తన నీతిని న్యాయప్రవర్తనను వస్త్రముగా ధరించుకొనగా అవియే తన తలకు పాగా ఆయెనని చెప్పుచున్నాడు. 15-17వ. గ్రుడ్డివారికి కన్నుగాను, కుంటివారికి పాదముగాను, దరిద్రులకు తండ్రిగా నుండి వారిని శ్రద్ధగా విచారించి, దుర్మార్గులను శిక్షింతినని యోబు చెప్పుచున్నాడు.

**18-21వ. దేవుడు గతములో యోబుకిచ్చిన స్థితిని బట్టి తనకు ఆపదలు రావని తలంచిన యోబు :-** దేవుడు గతములో యోబుకిచ్చిన స్థితిని బట్టి హంసవలె నేను

దీర్ఘాయువుగలవాడై వ్యాపించుదునని తనకు ఎడతెగని ఘనత కలుగునని యోబు తలంచాడు. మనుష్యులు తనకు చెవియొగ్గి తన ఆలోచన వినవలెనని మౌనముగా ఉండిరని చెప్పుచున్నాడు.

**22-25వ. రాజువలె దు:ఖించువారినందరిని ఓదార్చిన యోబు :-** యోబు మాటలాడిన తరువాత వారు మరుమాట పలుకక వర్షము కొరకు కనిపెట్టునట్లు వారు తనకొరకు కనిపెట్టుకొనిరని యోబు చెప్పుచున్నాడు. వారు ఆశారహితులై యుండగా వారిని దయగా చూచి చిరునవ్వు నవ్వగా తన ముఖప్రకాశము లేకుండా వారేమియు చేయలేదని, ప్రజలకు యోబు పెద్దగా మార్గములను ఏర్పరచి సేనలో రాజువలెను దు:ఖించువారిని ఓదార్చువానివలెను వుంటినని యోబు చెప్పుచున్నాడు.

# యోబు 30వ అధ్యాయము (7+7+5+6+6=31వ.)

## అంశము :- యోబు యొక్క రోగముచేత యెముకలు విరుగగొట్టబడునంత బాధ నొప్పి కలుగును.

**1-7వ. యోబు యొక్క రోగమును బట్టి యోబుకంటే చిన్నవారు యోబును యెగతాళి చేయుట :-** 1-2వ. ఇప్పుడైతే నాకన్న తక్కువ వయస్సు గలవారు నన్ను ఎగతాళి చేయుచున్నారని వారు దారిద్ర్యముచేత, క్షామముచేత, శుష్కించినవారై ఎడారిలో చాలా దినముల నుండి ఆహారముకొరకు తిరుగులాడువారని, తన మందలు కాయు కుక్కలతో నుండుటకు తగనివారని యోబు వారిని గూర్చి తలంచియుండెను. వారి చేతుల బలము తనకు ప్రయోజనము కాదని తలంచియుండెను. 3-7వ. వారు తుప్పలలోని తుత్తిచెట్లను పెరుకుదురు తంగేడువేళ్లు వారికి ఆహారమై యున్నవి. యోబును యెగతాళి చేయువారు నరుల మధ్యనుండి తరిమివేయబడినట్లు వారు తరుమబడుచు కేకలు వేయుదురు. ముళ్ల చెట్లక్రింద వారు కూడియుండి, లోయలలో, నేలసందులలోను, బండల సందులలోను కాపురముండవలసి వచ్చెనని యోబు చెప్పుచున్నాడు.

**8-14వ. యెబుకంటే చిన్నవారు యోబును మరింత యెగతాళి చేయుట :-**

8-10వ. యోబు తనకంటే చిన్నవారు తనమీదికి వచ్చిన ఆపదను అధికముగా కలుగజేయువారు పేరు ప్రతిష్టలు లేనివారికి పుట్టినవారని, దేశములోనుండి తరుమబడినవారని యోబు చెప్పుచున్నాడు. అట్టివారు ఇప్పుడు నన్ను గూర్చి పదములు పాడుటకు, తానువారికి ఆస్పదముగా నున్నానని యోబు చెప్పుచున్నాడు. వారు తనను అసహ్యించుకొనుచు తనయొద్ద నుండి దూరముగా పోవుచు, తనను చూచినప్పుడు ఉమ్మివేయుచున్నారని యోబు చెప్పుచున్నాడు. 11-14వ. దేవుడు తనను బాధించినందున అల్లరిమూకలు లేచి తనకు లోబడక నాశన ప్రయత్నములను యోబు మీద సాగింతురు. వారు నిరాధారులైనను తన మీదికి వచ్చిన ఆపదను మరి అధికముగా జేసినవారు వినాశములో కొట్టుకొని పోవుదురని యోబు చెప్పుచున్నాడు.

**15-19వ. దేవుడు యోబుకు రోగము కలుగజేసెనని నమ్మిన యోబు :-** రాత్రివేళ తన యెముకలు తనలో విరుగగొట్టబడినట్లు బాధించు భీకరమైన నొప్పులు తనకు దేవుడు కలిగించెనని యోబు చెప్పుచున్నాడు. గాలి కొట్టివేయు మేఘమువలె తన క్షేమము

గతించిపోయెనని తన ఆత్మ కరిగిపోవునంతగా ఆపద్దినములు తనను పట్టుకొనియున్నవని తాను ధూళియు, బూడిదయైనట్లున్నానని యోబు చెప్పుచున్నాడు.

**20-25వ. యోబుకు రోగము కలుగజేసిన దేవునికి మొరపెట్టుట :-** యోబు దేవునికి మొఱ్ఱపెట్టుచున్నను ప్రత్యుత్తరమియ్యక దేవుడు హింసించుచు తేరి చూచుచున్నాడని యోబు చెప్పుచున్నాడు. దరిద్రులు, బాధలోనున్నవారి నిమిత్తము తాను దు:ఖించితినని యోబు చెప్పుచున్నాడు. ఆపదలో నున్న యోబు తప్పింపబడవలెనని మొఱ్ఱపెట్టినను దేవుడు చెయ్యిచాపి, బాధలనుండి విడిపించుట లేదని యోబు చెప్పుచున్నాడు.

**26-31వ. యోబు తన రోగమును, బాధను దేవునికి వివరముగా చెప్పుట :-** యోబు తన యెముకలు కాగిపోయి, చర్మము నల్లబడి తన మీద నుండి ఊడిపోవుచున్నదని రోగములో దేవుడు తనకు మేలు కలుగునని యోబు ఆశించుకొని తన స్వరమండలములో దు:ఖస్వరము, రోదన శబ్దముతో మొఱ్ఱపెట్టి కనిపెట్టగా దేవుడు కీడు సంభవింపజేసినే కాని మొఱ్ఱకు జవాబివ్వలేదని చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 31వ అధ్యాయము

**(4+4+4+3+4+4+5+2+2+2+3+3=40వ.)**

**అంశము :- తాను నిర్దోషినని దేవుని యెదుట నిశ్చయించుకొనుట**

**1-4వ. యోబు తాను దేవునితో నిబంధన చేసికొన్నానని చెప్పుట :-** యోబు తాను కన్నులతో నిబంధన చేసికొంటినని కన్యకలను ఎవరినైనను చూడలేనని అంటున్నాడు. ఆలాగు చేయుట పరముననున్న దేవుని ఆజ్ఞకు వ్యతిరేకమని చెప్పుచున్నాడు. అటువంటి దుర్మార్గులకు దురవస్థ ప్రాప్తించి, విపత్తు సంభవించుటే వారికి శిక్ష అని చెప్పుచున్నాడు. ఉన్నత స్థలముననున్న సర్వశక్తుడగు దేవుడు తన ప్రవర్తన నెరుగును గనుక తన అడుగుజాడలను అన్నిటిని లెక్కించునని చెప్పుచున్నాడు.

**5-8వ. యోబు తాను యదార్థుడైయున్నానని దేవుని సన్నిధిలో స్థిరపరచుట :-** యోబు తాను మోసము చేయుటకై త్వరపడక యదార్థుడనైయున్నానని దేవునికి తెలియునని చెప్పుచున్నాడు. నేను త్రోవ విడిచి నడిచిన యెడల దేవుడు త్రాసులో నన్ను తూచి, నేను నాటినది పెరికివేయును గాక అని చెప్పుచున్నాడు.

**9-12వ. యోబు పరస్త్రీని మోహించుట శిక్ష నొందతగిన నేరమని గుర్తించాడు:-** నేను హృదయమున పరస్త్రీని మోహించిన యెడల అది దుష్కామకార్యమని, న్యాయాధిపతులచేత శిక్ష నొందతగిన నేరమని పొరుగువారి ద్వారమున నేను పొంచియున్న యెడల దేవుడు నా ఆదాయమును నిర్మూలము చేయునని ఎరుగుదునని యోబు చెప్పుచున్నాడు.

**13-15వ. పనివారిని నిర్లక్ష్యము చేయని యోబు :-** యోబు తనను గర్భమున పుట్టించినవాడు పనివారిని కూడా పుట్టించాడని యోబు గుర్తించాడు. కనుక వారి వ్యాజ్యమును నిర్లక్ష్యము చేయనని యోబు చెప్పుచున్నాడు. దేవుడు న్యాయమును విచారణ చేయునప్పుడు దేవునితో ప్రత్యుత్తరమివ్వలేనని యోబు చెప్పుచున్నాడు.

**16-19వ. యోబు బీదలపైన దయచూపువాడు :-** బీదలు ఇచ్ఛయించిన దానిని బిగబట్టక విధవరాండ్రను, తల్లిదండ్రులు లేనివారిని అన్నము కొంచెమైనను తిననియ్యక నేను ఒంటరిగా భోజనము చేయలేదని చెప్పుచున్నాడు. ఎవడైనను వస్త్రహీనుడై యుండుట, బీదలకు వస్త్రము లేకపోవుట చూచి వారి దేహములకు గొఱ్ఱెల బొచ్చుచేత వేడిమి కలుగజేసితినని యోబు చెప్పుచున్నాడు.

**20-23వ. యోబు బీదలపైన దయచూపిన వివరము :-** తండ్రిలేనివారికి, దిక్కులేనివారికి అన్యాయము చేయక తాను తల్లి గర్భమందు పుట్టిననాటనుండి దిక్కులేని వానికి నేను మార్గదర్శినైతినని చెప్పుచున్నాడు. తండ్రి భావముతో తనను భావించి తన యొద్ద పెరిగిన వారికి మేలుచేయని యెడల దేవుడు తనను నిర్మూలము చేయునని భయపడుచున్నానని యోబు చెప్పుచున్నాడు.

**24-28వ. దేవునికి బదులు సువర్ణమునకు ఆధారపడిన యెడల దేవుని దృష్టికి వేషధారినవుదునని యోబు గుర్తించుట :-** సువర్ణము తనకు ఆధారమనుకొని మేలిమి బంగారముతో నా ఆశ్రయము నీవేయని చెప్పిన యెడల పరముననున్న దేవుని దృష్టికి వేషధారినవుదునని గుర్తించాడు. నా ఆస్తి గొప్పదని సంతోషించిన యెడల అది న్యాయాధిపతులచేత శిక్షనొందతగిన నేరమని గుర్తించి ఒప్పుకొనుచున్నాడు.

**29-30వ. యోబు తనను ద్వేషించినవారిని శపించలేదు :-** యోబు పెట్టిన భోజనము తిని, తృప్తిపొందని వారెవరులేరని తనను ద్వేషించిన వానికి కలిగిన నాశనమును బట్టి సంతోషించలేదని అతని ప్రాణమును శపించలేదని యోబు చెప్పుచున్నాడు.

**31-32వ. పరదేశులకు కూడా భోజనము పెట్టాడు :-** పరదేశికి తలుపులు తెరచి భోజనము పెట్టితినని తన గుడారమందు పలుకుచున్నారని యోబు చెప్పుచున్నాడు.

**33-34వ. ఆదామువలె దోషములను దాచిపెట్టుకొని మౌనముగా నుండలేదు:-** రొమ్ములో పాపమును కప్పుకొనిన యెడల పరమున నున్న దేవుని దృష్టికి వేషధారినవుదునని యోబు గుర్తించాడు. ఆదాము చేసినట్లు దోషములను దాచిపెట్టుకొని సమూహమునకు భయపడి మౌనముగా నుండలేదని యోబు చెప్పుచున్నాడు.

**35-37వ. రాజువలె దేవునికి ఫిర్యాదు చేసి, సర్వశక్తుని నుండి జవాబును పొందుదునన్న యోబు :-** తన మనవిని విని దేవుడు వుత్తరమిచ్చునని యోబు దేవునికి మొరపెట్టాడు. యోబు దేవుని యొద్దకు వెళ్ళి తన అడుగుల లెక్క తెలియజేసి, దేవుడు బహుమానముగా తనకు కిరీటముగా ధరింపజేయునని నిరీక్షణ కలిగియున్నా ననుచున్నాడు.

**38-40వ. ముగింపులో యోబు తాను నిర్దోషినని మరొకసారి చెప్పుట:-** యోబు తాను క్రయధనము ఇయ్యక ఎవరిదైనను అనుభవించలేదని, ఎవరికి ప్రాణహాని కలుగజేయలేదని చివరిగా నొక్కి వక్కాణించుచున్నాడు.

# యోబు గ్రంథము 32వ అధ్యాయము (5+5+7+5=22వ.)

**అంశము :- యోబు తాను నీతిమంతుడనని కలిగియున్న తప్పుడు తలంపులు ముగ్గురు స్నేహితులు ఖండించినందున ఎలీహు దేవుడు తనకు చెప్పినది చెప్పట.**

**1-5వ. ఎలీహు, యోబు దేవునికంటె తానే నీతిమంతుడైనట్లు చెప్పుకొనుట చూచి యోబుమీద, యోబు యొక్క ముగ్గురు స్నేహితులమీద బహుగా కోపగించుట :-**

యోబు తన దృష్టియందు తాను నీతిమంతుడైయున్నాడని ఆ ముగ్గురు తెలిసికొని అతనికి ప్రత్యుత్తరము చెప్పుట చాలించిరి. యోబు యొక్క ముగ్గురు స్నేహితులు ఎలీహుకన్న ఎక్కువ వయస్సుగలవారు కనుక ఎలీహు ఇంతవరకు మౌనముగా వుండి యోబుమీద కోపగించాడు. యోబు యొక్క ముగ్గురు స్నేహితులు ప్రత్యుత్తరమేమియు చెప్పకయే యోబుమీద దోషము మోపినందుకు స్నేహితుల మీద ఎలీహు బహుగా కోపగించాడు. ఎలీహుకన్న ఎక్కువ వయస్సుగల ఆ మనుష్యులు ప్రత్యుత్తరమియ్యకపోవుట చూచినప్పుడు యోబుతో మాటలాడుటకు ఎలీహు కనిపెట్టియున్నాడు.

**6-10వ. యోబు మీద ముగ్గురు స్నేహితులమీద కోపగించిన ఎలీహు మాటలాడుట:-**

అధిక సంఖ్యగల యేండ్లు జ్ఞానము బోధింపతగునని తలంచితినని ఎలీహు చెప్పుచున్నాడు. ఆ హేతువుచేత భయపడి తన తాత్పర్యము వారికి తెలుపుటకు తెగింపలేదని చెప్పుచున్నాడు. నరులలో దేవుని ఊపిరి అగు పరిశుద్ధ ఆత్మ వారికి వివేచన కలుగజేయును కనుక వృద్ధులు బహు వయస్సు గలవారైనను ఒకప్పుడు న్యాయము తెలిసినవారుకారని ఎలీహు గుర్తించాడు. కావున తన మాట నంగీకరించుడని యోబుకు, ముగ్గురు స్నేహితులకు మనవి చేసి ఎలీహు తన తాత్పర్యమును తెలుపుచున్నాడు.

**11-17వ. యోబు తాను నీతిమంతుడనని కలిగియున్న తప్పుడు తలంపును స్నేహితులు ఖండించనందున తాను మాటలాడవలసి వచ్చినదని ఎలీహు చెప్పుట:-**

ముగ్గురు స్నేహితులు తమ మాటలలో యోబు యొక్క తప్పుడు అభిప్రాయమును ఖండించనందున ఆ ముగ్గురు చెప్పిన మాటలను బహు జాగ్రత్తగా విని వారిలో ఎవరును యోబును ఖండింపలేదు కనుక తాను మాటలాడవలసి వచ్చినదని ఎలీహు తన తాత్పర్యమును చెప్పుచున్నాడు.

**18-22వ. ఎలీహు తనను సృజించిన దేవునికి భయపడుచు ఎవరియెడలను ఏకపక్షపాతిగా యుండక, ఎవరిని ముఖస్తుతిచేయక, మనస్సులో మాటలను తనలో నున్న దేవుని ఆత్మ బలవంతముచేయుచున్నందున ప్రత్యుత్తరమిచ్చుట :-**

నా మనస్సులో వున్న మాటలను తన అంతరంగముకన్న ఆత్మ బలవంతము చేయుచున్నందున తాను మాటలాడి ఆయాసము తీర్చుకొన తలంచాడు. ఎవరి యెడలను పక్షపాతినై, ఎవరికిని ముఖస్తుతి చేసిన తనను సృజించినవాడు తనను శీఘ్రముగా నిర్మూలము చేయునని గుర్తించి మీరు దయచేసి వినుడని దేవుడు తనను చెప్పమన్న మాటలను చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 33వ అధ్యాయము (7+6+7+6+4+3=33వ.)

## అంశము :- యోబును గూర్చి ఎలీహు మాటలు కొనసాగుట.

**1-7వ. యోబు, ఆలకించవలెనని ఎలీహు కోరుట :-** యోబు నీతిమంతుడనని కలగియున్న తలంపును దిద్దుటకు దేవుడు చెప్పిన మాటలన్ని వినవలెనని ఎలీహు చెప్పుచున్నాడు.

**8-13వ. ఎలీహు యోబును, తన వాదము ఆలకించవలెనని కోరుట :-** నేను పాపరహితుడనైనను దేవుడు తనను నేరస్థుడుగా ఎంచుచున్నాడని యోబు తనన గూర్చి తలంచుచున్నాడు. ఆలాగు తనను గూర్చి యోబు చెప్పుకొనుట తప్పని ఎలీహు చెప్పి యోబును ఒప్పించుటకు ప్రయత్నించుచున్నాడు.

**14-18వ. యోబు దేవుని గూర్చి చెప్పుట :-** దేవుడు ఒక్కసారి పలుకును మనుష్యులు అది కనిపెట్టుటలేదని యోబు చెప్పుచున్నాడు. మంచము మీద గాఢనిద్ర పట్టునప్పుడు స్వప్నములలో నరులు గర్విష్టులు కాకుండ చేయునట్లు తాము తలచిన కార్యము వారు మానుకొనచేయునట్లు వారి ప్రాణమును తప్పించునట్లు దేవుడు వారి చెవులు తెరచి వారికి ఉపదేశము చేయునని యోబు చెప్పుచున్నాడు.

**19-26వ. దేవుడు మానవులకు చేయుదానిని గూర్చి యోబు చెప్పుట :-** వ్యాధిచేత శరీర మాంసము క్షీణించిపోయి వాడు పాతాళములోనికి దిగిపోవును. ఇట్టి నరులకు యుక్తమైనది ఏదో దానిని వానికి తెలియజేయుటకు వేలాది దూతలలో ఘనుడగు ఒకడు మానవులకు దేవునికి మధ్యవర్తియై యుండినయెడల ఎంతో మేలని యోబు చెప్పుచున్నాడు. పాపమునకు ప్రాయశ్చిత్తము కలుగుటను బట్టి మానవునికి పాపక్షమాపణ దొరకునని చెప్పుచున్నాడు. యోబు తన శరీరము పుచ్చిపోయి తాను సమాదికి వెళ్ళు సమయము సమీపించినను మానవుల పాపమునకు కలుగు ప్రాయశ్చిత్తము శాశ్వత మైనదని గుర్తించి దేవుని వేడుకొనుచున్నాడు. దేవుడు మానవులను నీతిమంతులుగా చేయుట యోబు తలంచుట ఎంతో గొప్పదని మనము నేర్చుకోవాలి.

**27-30వ. యోబు దేవుని గూర్చి చెప్పుట :-** మానవులు కూపములోనికి దిగిపోకుండ ప్రాణమును విమోచించి, మన జీవము వెలుగును చూచు మానవుల కొరకు రెండు, మూడుసారులు దేవుడు భూలోకమునకు వచ్చువాడైయున్నాడని యోబు గుర్తించాడు.

**31-33వ. యోబును గూర్చి ఎలీహు చెప్పుట :-** యోబు, మౌనముగా నుండి జ్ఞానము బోధించు తన మాట ఆలకించవలెనని ఎలీహు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 34వ అధ్యాయము (4+5+11+10+7=37వ.)

**అంశము :- యోబును గూర్చి ఎలీహు మాటలు కొనసాగుట.**

**1-4 యోబును గూర్చి ఎలీహు ఇంకను మాటలాడుట :-** యోబు తాను నీతిమంతుడనని కలిగియున్న తప్పుడు అభిప్రాయమును దిద్దు నిమిత్తము దేవుడు ఎలీహునకు చెప్పిన మాటలన్నిటికి యోబు అంగీకరించలేదని న్యాయమైనది, ఏదో మనము విచారించి తెలిసికొందము రమ్మని ఎలీహు పిలుచుచున్నాడు.

**5-9వ. యోబు న్యాయవంతుడుగా తానువున్నను అబద్ధికునిగా ఎంచబడుచున్నానని తలంచుట :-** తాను న్యాయవంతుడనై యుండినను దేవునిచేత అబద్ధికునిగా ఎంచబడుచున్నానని చెప్పుచున్నాడు. దేవుడు తనకు మానని గాయము కలిగించెనని తలంచుచున్నాడు. యోబు క్రుంగినవాడై నరులు దేవునితో సహవాసము చేయుట ప్రయోజనకరము కాదని చెప్పుట గమనించుచున్నాము. యోబువంటి కష్టములు మనకు వచ్చినను మనము ఆలాగున మాటలాడకూడదని నేర్చుకొందము.

**10-20వ. యోబు ఇంకను తాను నీతిమంతుడనని మాటలాడుట :-** సర్వశక్తుడగు దేవుడు దుష్కార్యము చేయుట, అన్యాయము చేయుట అసంభవము. నరుల మార్గములను బట్టి, క్రియలకు తగినట్టుగా అందరికి ఫలమిచ్చును. 14-16వ. దేవుడు మన శ్వాస, నిశ్వాసలను తనయొద్దకు తిరిగి తీసికొనిన యెడల శరీరులందరు ఏకముగా నశించి, నరుల మరల ధూళియై పోవుదురు. 17-20వ. దేవుడు న్యాయమును ద్వేషించువాడని నేరము మోపలేము. మనుష్యులందరు నిమిషములో చనిపోయి నశించుదురు.

**21-30వ. దేవుడు తన యొద్దకు మానవులను తీసికొను విధమును యోబు జ్ఞాపకము చేయుట :-** దేవుడు తనను అనుసరించుట మానిన దుష్టులను బహిరంగముగా శిక్షించును. ఏలయనగా వారు మనుష్యులందరు రక్షణ పొందవలెనను దేవుని ఆజ్ఞను, లక్ష్యపెట్టకపోయిరి. రక్షణపొందిన వారికి దేవుడు సమాధానము కలుగజేయును గనుక శిక్ష విధింపగలవాడెవడును వుండడు. ఈ మాటలు మానవులు అందరికిని వర్తించునవియే.

**31-37వ. యోబు బుద్ధిహీనమైన మాటలు :-** యోబు బుద్ధిహీనమైన మాటలు మాటలాడుచున్నాడు. నేను శిక్షనొందితిని ఇకను పాపము చేయనని చెప్పవలసిన యోబు నేను దుష్కార్యము చేసియున్నాను ఇకను చేయనని దేవునితో చెప్పుటలేదు. మనము పాపము చేయలేదని తలంచక దేవుని సన్నిధిలో ఎల్లప్పుడు మనలను మనము పరీక్షించుకొని దిద్దుకొనుచుండాలని నేర్చుకొందము.

# యోబు గ్రంథము 35వ అధ్యాయము (3+5+4+4=16వ.)

## అంశము :- యోబును గూర్చి ఎలీహు మాటలు కొనసాగుట.

**1-3వ. యోబు యొక్క తప్పుడు తలంపు :-** యోబు తాను చేసిన పాపము వలన కలిగిన లాభముకన్న తన నీతివలన ఎక్కువ లాభము కలుగలేదని చెప్పుట ఎలీహు గమనించి ఆలాగు తలంచరాదని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు.

**4-8వ. ఎలీహు యోబుకు చెప్పిన మాటలు :-** యోబు ఆకాశమువైపు నిదానించి చూచిన మానవులు పాపము చేసినను, నీతిగా జీవించినను దేవునికి మానవులనుండి ఏమియు లభించదు. యోబు వంటి మనుష్యులు తమ చెడుతనమునకు ఫలముకాని తమ నీతికి ఫలముకాని పొందుదురని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు.

**9-12, 13-16వ. దుష్టులైన మనుష్యులవలె గర్వమును బట్టి కాక విధేయతతో మొఱ్ఱపెట్టిన దేవుడు జవాబిచ్చును :-** అనేకులు బలవంతుల భుజబలమునకు భయపడి సహాయము కొరకై కేకలు వేయుదురు. మనకు ఎక్కువ బుద్ధి నేర్పుచు రాత్రియందు కీర్తనలు పాడుటకు ప్రేరేపించుచు భూజంతువుల కంటే ఆకాశ పక్షులకంటే మనకు ఎక్కువ బుద్ధి నేర్పుచు మనకు ఎక్కువ జ్ఞానము కలుగజేయుచున్న మనలను సృజించిన దేవుడు ఎక్కడ నున్నాడని యోబువంటి మానవులు అనుకొనుటలేదని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు. దుష్టులైన మనుష్యుల గర్వమునుబట్టి మొఱ్ఱపెట్టుదురు. కాని దేవుడు వారిని లక్ష్యపెట్టక ప్రత్యుత్తరమిచ్చుటలేదని యోబు దీనుడై తననుతాను తగ్గించుకొని దేవునికి మొఱ్ఱపెట్టిన సర్వశక్తుడగు దేవుడు లక్ష్యపెట్టునని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు. నిర్హేతుకముగా యోబు దురహంకారముతో తెలివిలేని వానివలె మాటలను విస్తరింపజేసియున్నాడని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు. మనము తెలివిలేని వానివలె దేవునితో ప్రార్థనలో మాటలాడకూడదని గుర్తింతము.

# యోబు గ్రంథము 36వ. అధ్యాయము (4+6+5+6+4+7=33వ.)

## అంశము :- యోబును గూర్చిన ఎలీహు మాటలు కొనసాగుట

**1-4వ. ఎలీహు మాటలాడుట :-** ఎలీహు యోబుతో కొంతసేపు తాను దేవుని పక్షమున మాటలాడుటను ఓర్చుకొనుమని యోబుకు చెప్పుచున్నాడు. పూర్ణజ్ఞానిగా ఎలీహు తనను సృజించిన వానికి నీతిని ఆరోపించెదనని యోబు వినవలెనని చెప్పుచున్నాడు.

**5-10వ. దేవుని గొప్పతనము :-** బలవంతుడగు దేవుని వివేచనాశక్తి బహుబలమైనదని ఆయన భక్తిహీనుల ప్రాణము కాపాడక దీనులకు న్యాయము జరిగించునని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు. నీతిమంతులను దేవుడు తప్పక చూచునని సింహాసనముమీద కూర్చుండు రాజులతో ఆయన తన భక్తులను నిత్యమును కూర్చుండబెట్టి ఘనపరచునని చెప్పుచున్నాడు. తన భక్తులు తన ఉపదేశము వినుటకై వారి చెవిని తెరువజేయునని పాపము విడిచి దేవుని యొద్దకు రావలెనని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు.

**11-17వ. దేవుని గొప్పతనము :-** యోబు దేవుని మాటలు ఆలకించి దేవుని సేవించినయెడల తన దినములను సుఖముగాను వెళ్లబుచ్చునని ఆలకింపని యెడల జ్ఞానము లేక చనిపోయెదరని ఎలీహు చెప్పుచున్నాడు. హృదయపూర్వకమైన భక్తిలేనివారు దేవునికి మొఱ్ఱపెట్టక మృతినొందుదురు. శ్రమపడువారు ఆయనకు మొరపెట్టిన శ్రమలనుండి వారిని విడిపించి వారిని విధేయులుగాచేసి బాధలనుండి తప్పించునని క్రొవ్వుతో నిండిన ఆహారమిచ్చునని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు.

**18-21వ. యోబుకు అవసరమైన పాపక్షమాపణను గూర్చి దేవుడు చెప్పుట :-** యోబు పాపముకై దేవుడు చేయవలసిన ప్రాయశ్చిత్తము గొప్పదని యోబు గుర్తించాలి. యోబు తిరస్కారము చేయక దేవునికి మొఱ్ఱపెట్టుటకు జాగ్రత్తపడవలెనని దేవుడు చెప్పుచున్నాడు. చెడుతనము లేక జాగ్రత్తపడి ప్రార్థించుట మంచిదని దేవుడు చెప్పుచున్నాడు.

**22-26వ. మనుష్యులకు దేవుడు చేయు విధము :-** ఆలోచించుము, ఘనత వహించిన శక్తిమంతుడైన దేవుని పోలిన బోధకుడెవడును లేడు. ఆయన దుర్మార్గపు పనులు చేయుచున్నాడని ఎవడును పలుక తెగించడు. సకల మనుష్యులవలె దేవుని కీర్తించి ఆయన కార్యమును మహిమపరచుటకై యోబు జాగ్రత్త పడవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

మనుష్యులు దూరమున నిలిచి దేవుడు మహోన్నతుడు ఆయన సంవత్సరముల సంఖ్య మితిలేనిదని మనము ఆయనను ఎరుగమని ఆయనను గూర్చి పలుకుదురు.

**27-33వ. సృష్టిలో దేవుడు చేయు విధము :-** దేవుడు ఉదకబిందువులను పైనుండి కురిపించగా మంచుతో కూడిన మేఘములు, ఉరుములు వచ్చి వర్షమును సమృద్ధిగా కుమ్మరించును. దేవుని మందిరములో నుండి మేఘములు వ్యాపించుటను ఎవడైన గ్రహింపజాలడని దేవుడు చెప్పుచున్నాడు. దేవుడు ఆహారమును ప్రజలకు సమృద్ధిగా ఇచ్చువాడు. దేవుని గర్జనము దేవునిని ప్రసిద్ధి చేయును. తాను వచ్చుచున్నాడని ఆయన పశువులకును తెలుపును. దీని భావము ప్రభువు రెండు రాకడలు పశువులకు తెలియును. ప్రభువు బెత్లెహేములో పుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టినప్పుడు పశువులు ప్రభువైన యేసును గుర్తించి ఆయనను తమ తొట్టిలో పండుకొనబెట్టుటకు సహకరించాయి. గతములో సునామీ వచ్చినప్పుడు కొన్ని చోట్ల పశువులు తాము కట్టబడిన ఇనుప గొలుసులను తెంచుకొని బయటకు పరిగెత్తినట్లు వార్తా పత్రికలలో చదివితిమి. సృష్టిలో జరుగు మార్పులను పశువులకు దేవుడు తెలియజేయునని గుర్తించుచున్నాము.

# యోబు గ్రంథము 37వ అధ్యాయము (6+7+5+6=24వ.)

## అంశము :- యోబు గూర్చిన ఎలీహు మాటలు కొనసాగుట

**1-6వ. ఉరుములు, మెరుపులు, వర్షము దేవుడు ఆజ్ఞ ఇవ్వగా లోబడుచున్నవి:-** యోబు మౌనముగా వుండి దేవుడు ఆశ్చర్య కార్యములను దేవుడు చేయు గొప్ప కార్యములను గ్రహించవలెనని యోబుకు ఎలీహు చెప్పుచున్నాడు. ఆయన నోటనుండి బయలు వెళ్లు ధ్వనినిబట్టి నీవు భూమి మీద పడుమని హిమముతోను, మహావర్షముతోను ఆయన ఆజ్ఞ ఇవ్వగా అవి లోబడుట చూడగా తన హృదయము వణకుచున్నదని ఎలీహు చెప్పుచున్నాడు. ఆకాశ వైశాల్యమంతటి క్రింద భూమ్యంతముల వరకు తన మెరుపును కనబడజేసి దేవుడు ఆశ్చర్యముగా ఉరుము ధ్వని చేయును. మనము గ్రహింపలేని గొప్ప కార్యములను దేవుడు ఆలాగు చేయును. నీవు భూమిమీద పడుమని వర్షముతోను ఆయన ఆజ్ఞ ఇవ్వగా అవి లోబడినట్లు మనమును దేవునికి లోబడవలెనని ఎలీహు చెప్పుచున్నాడు.

**7-13వ. సృష్టికార్యములు వర్షము దేవుని వలన నడిపించబడుచున్నవి :-** మనుష్యులు అందరు ఆయన సృష్టికార్యమును తెలిసికొనునట్లు తుఫానును, చలిని దేవుని ఊపిరివలన మంచును పుట్టించి, మేఘమును దేవుడు వ్యాపింపజేయును. అవన్నియు దేవుని వలన నడిపింపబడినవై నరులకు నివాస యోగ్యమైన భూగోళముమీద దేవుని చిత్తమును నెరవేర్చును. భూలోకముకొరకు దేవుడు ఆజ్ఞాపించిన దానిని నెరవేర్చుచున్నవని యోబు గుర్తించవలెనని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు.

**14-18వ. యోబుకు ఎలీహు చెప్పుట :-** యోబు ఊరకుండి దేవుని అద్భుత క్రియలను, మేఘములను, దట్టమైన ఆకాశములో వ్యాపింపజేసి తేలచేయుటలో దేవుని పరిపూర్ణ జ్ఞానమును ఆలోచించవలెనని యోబుకు చెప్పుచున్నాడు.

**19-24వ. యోబు నేర్చుకొనవలసిన వాటిని ఎలీహు యోబుకు చెప్పుట :-** యోబు దేవునితో ఏమి పలుకవలెనో అది తెలుపుమని దేవుని అడిగి తెలిసికొనవలెనని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు. మహాత్మ్యము గల సర్వశక్తుడు, అగోచరుడగు దేవుడు మనకు న్యాయమును, నీతిని ఏ మాత్రమును చెరుపక, తాము జ్ఞానులమను కొనువారిని ఏమాత్రమును లక్ష్యపెట్టడని నరులు గుర్తించి ఆయనయందు భయభక్తులు కలిగియుండాలని ఎలీహు యోబుకు చెప్పుచున్నాడు.

## యోబు గ్రంథము 38వ అధ్యాయము (3+4+4+4+3+3+9+8+3=41వ.)

### అంశము :- దేవుడు యోబుకు సృష్టిని గూర్చి చెప్పుట.

**1-3వ. దేవుడు యోబుకు ప్రశ్నవేయుట :-** యెహోవా సుడిగాలిలోనుండి ఈలాగున జ్ఞానములేని మాటలు చెప్పి ఆలోచనను చెరుపుచున్న యోబుతో మాటలాడుచు, యోబు పౌరుషము తెచ్చుకొని నడుము బిగించుకొని, దేవుని ప్రశ్నకు జవాబు చెప్పవలెనని దేవుడు కోరుచున్నాడు.

**4-7వ. భూమికి పునాది వేసిన దేవుడు :-** ఉదయ నక్షత్రములు ఏకముగాకూడి పాడి దేవదూతలు అందరు ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు దేవుడు భూమికి పునాదులు మూలరాతిని వేసినప్పుడు వివేకము కలిగియున్న యోబు ఎక్కడ వుండెనో చెప్పుమని దేవుడు అడుగుచున్నాడు. భూమికి పరిమాణమును నియమించిన వాడెవడో చెప్పుమని, భూమియొక్కస్తంభముల పాదులు దేనితో కట్టబడినవో చెప్పుమని దేవుడు అడుగుచున్నాడు.

**8-11వ. సముద్రమునకు సరిహద్దులు నియమించుట :-** 8-9వ. సముద్రము దాని గర్భమునుండి పొర్లిరాగా తలుపులచేత దేవుడు మూసివేసి మేఘమును, గాఢాంధకారమును సముద్రమునకు వస్త్రముగాను వేసినప్పుడు యోబు ఎక్కడ వున్నాడని దేవుడు అడుగుచున్నాడు. 10-11వ. సముద్రమునకు హద్దు నియమించి తలుపులను, గడియలను పెట్టి మరి దగ్గరకు రాకుండా దాని పొంగు అణపబడునని దేవుడు చెప్పినప్పుడు యోబు ఎక్కడ వున్నాడని అడుగుచున్నాడు.

**12-15వ. సూర్యోదయమున వెలుతురు భూదిగంతములవరకు వ్యాపించుట :-**
12-13వ. అరుణోదయమున దుష్టులు దులిపివేయబడి భూదిగంతముల వరకు వెలుగు వ్యాపించునట్లు ఎప్పుడైన ఉదయమును కలుగజేయనా అని యోబును దేవుడు అడుగుచున్నాడు. 14-15వ. అరుణోదయము కలుగగానే భూమి మార్పునొంది, విచిత్రమైన పనిగల వస్త్రమువలె కనబడి, దుష్టుల వెలుగు తీసివేయబడి, వారి బాహువు విరుగగొట్టబడునని దేవుడు యోబుతో చెప్పుచున్నాడు.

**16-18వ. సముద్రము అడుగుననున్న మరణాంధకార ద్వారము :-** మహాసముద్ర మాటల అడుగున యోబు సంచరించి, మరణాంధకార ద్వారములను చూచెనేమో, భూమి వైశాల్యత ఎంతో తెలిసిన యెడల చెప్పుమని యోబును దేవుడు అడుగుచున్నాడు.

**19-21వ. వెలుగు నివసించుచోటు, చీకటి యొక్క ఉనికిపట్టును యెరిగియుండుట :-** వెలుగు నివసించు చోటునకు పోవు మార్గము, చీకటి యొక్క ఉనికిపట్టు ఏదో, దాని గృహమునకు పోవు త్రోవలు, బహువృద్ధుడైన యోబుకు తెలిసియున్న యెడల చెప్పవలెనని యోబును దేవుడు అడుగుచున్నాడు.

**22-30వ. హిమము యొక్క నిధులు వర్షమును కురిపించుట :-** దేవుడు ఆపత్కాలముకొరకు, యుద్ధము కొరకు దాచియుంచిన హిమము యొక్క నిధులను, యెడారిలో వర్షము కురిపించుటకు దేవుడు నియమించిన వడగండ్ల నిధులను చూచితివా అని యోబును అడుగుచున్నాడు. లేతగడ్డి మొలిపించుటకును నీటి కాలువలను నిర్ణయించి ఉరుములకు, మెరుపులకు ఆకాశమునుండి దిగు మంచుకు మార్గము చూపువాడెవడో అని యోబు ఎరుగవలెనని దేవుడు కోరుచున్నాడు.

**31-38వ. ఆకాశ నక్షత్రముల కట్టడలను యెరిగి నక్షత్రములను నడిపించుట :-** వాటివాటి కాలములలో నక్షత్రరాసులు వచ్చునట్లు చేయగలవా అని దేవుడు యోబును అడుగుచున్నాడు. జలరాసులు కప్పబడునట్లు మేఘములకు ఆకాశము వర్షమును కుమ్మరించునట్లు ఆజ్ఞనిచ్చి, మేఘములను వివరింపగలవా అని యోబును దేవుడు అడుగుచున్నాడు.

**39-41వ. సింహపు పిల్లలకు, కాకి పిల్లలకు ఆహారము సమకూర్చుట :-** ఆడ సింహము పిల్లల నిమిత్తము ఎరను వేటాడి, సింహపుపిల్లల ఆకలిని తీర్చుటకు ఆహారము సిద్ధపరచువాడెవడో, తిండిలేక తిరుగులాడు కాకిపిల్లలు ఆహారముకై మొఱ్ఱపెట్టునప్పుడు వాటికి ఆహారము సిద్ధపరచువాడెవడో యోబు ఎరుగవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 39వ అధ్యాయము (4+4+4+6+7+5=30వ.)

**అంశము :- దేవుడు యోబుకు సృష్టిని గూర్చి చెప్పిన మరికొన్ని మాటలు.**

**1-4వ. అడవిలోని కొండ మేకలు, లేళ్లు పిల్లలను కనుట :-**

1-2వ. అడవిలోని కొండ మేకలు, లేళ్లు పిల్లలను వేయు కాలము యోబుకు తెలియదని, గ్రహింపలేడని దేవుడు చెప్పుచున్నాడు. 3-4వ. పుట్టిన పిల్లలు పుష్టి కలిగి యెడారిలో పెరుగుచూ, తల్లులను విడిచిపోయి వాటి యొద్దకు తిరిగిరావని యోబు తెలిసికొనవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

**5-8వ. స్వేచ్ఛగా తిరుగులాడు అడవి గాడిద :-** 5-6వ. అడవి గాడిద అరణ్యములో స్వేచ్ఛగా తిరుగునట్లు దాని కట్లను విప్పితినని దేవుడు చెప్పుచున్నాడు.

7-8వ. పట్టణపు కోలాహలములను తిరస్కరించి, పర్వత పంక్తులలో మేతగా ప్రతివిధమైన పచ్చని మొలకలను అది వెదకునని యోబు తెలిసికొనవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

**9-12వ. గురుపోతును లోబరచుకొని, కళ్లమందు ధాన్యమును కూర్చుట :-**

9-10వ. యోబుకు గురుపోతులోబడి, శాలలో నిలుచుటకు సమ్మతించదని పగ్గము వేసి గురుపోతును నాగేటి చాలులో కట్టబడినను లోయలను చదరము చేయలేడని తెలిసికొనవలెనని దేవుడు చెప్పుచున్నాడు. 11-12వ. గురుపోతు బలము గొప్పది కనుక కళ్లమందున్న ధాన్యమును ఇంటికి తెచ్చి కూర్చునని నమ్మకూడదని యోబు తెలిసికొనవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

**13-17వ. నిప్పుకోడి దాని పిల్లలు :-** నిప్పుకోడి సంతోషము చేత రెక్కల నాడించినను, నేలను ధూళిలో గుడ్లను పెట్టి అడవి జంతువు వాటిని చితకద్రొక్కవచ్చునని అనుకొనదు, పుట్టిన పిల్లలు తనవికానట్లు ఆ పిల్లలు వ్యర్థమైనను అది చింతించనిరీతిగా దేవుడు దానికి వివేచనాశక్తిని అనుగ్రహించక తెలివిలేనిదిగా యోబు గుర్తించవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

**18-25వ. గుర్రములను గూర్చినది :-** 18-20వ. గుఱ్ఱము దాని నాసికా రంధ్రములలో భీకరము ధ్వనిచేయుచు మిడతవలె గంతులు వేయుచు లేచునప్పుడు దాని రౌతును గుఱ్ఱము తిరస్కరించునని యోబుకు దేవుడు చెప్పుచున్నాడు.

21-22వ. గుఱ్ఱము కాలుదువ్వి తన బలమును బట్టి సంతోషించునని ఖడ్గమును చూచి భీతినొందక వెనుకకు తిరుగదని యోబు గుర్తించవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

23-25వ. అంబులపొది, తళతళలాడు ఈటెలు, బల్లెము, దానిమీద గలగల లాడించునప్పుడు కోపముతో బహుగా పరుగులెత్తుచు, దూరము నుండి యుద్ధ ఘోషను, యుద్ధ వాసను తెలిసికొనునని దేవుడు చెప్పుచున్నాడు.

**26-30వ. డేగ, పక్షిరాజును గూర్చినది :-** 26-28వ. పక్షిరాజు తన రెక్కలు చాపి ఆకాశవీధిలో ఎత్తయిన చోట రాతి కొండమీద తన గూడు కట్టుకొనునని దేవుడు చెప్పుచున్నాడు. 29-30వ. అక్కడ నుండి యెరను దూరమునుండి కనిపెట్టునని యోబు తెలిసికొనవలెనని దేవుడు చెప్పుచున్నాడు.

# యోబు గ్రంథము 40వ. అధ్యాయము (5+4+5+5+5=24వ.)

## అంశము :- యోబుతో దేవుడు మాటలాడుట.

**1-5వ. దేవుడు యోబుతో మాటలాడుట :-** దేవుడు యోబుతో సర్వశక్తుడగు దేవునితో వాదింపగలవా అయితే ఇప్పుడు ప్రత్యుత్తరమివ్వు అంటున్నాడు. అప్పుడు యోబు యెహోవాతో నేను నీచుడను, ఏమని ప్రత్యుత్తరమివ్వగలను. ఇక మాట్లాడను మౌనంగా ఉంటాను అంటున్నాడు. యోబు దేవుడు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక పశ్చాత్తాపముతో తగ్గించుకుంటున్నాడు, దేవునికి కావలసింది అది.

**6-9వ. అప్పుడు యెహోవా సుడిగాలిలో నుండి ఈలాగు యోబుతో ప్రత్యుత్తరమిచ్చెను :-** దేవుడు యోబుతో నీవు నా న్యాయమును బొత్తిగా కొట్టివేసి నిర్దోషివని నీవు తీర్పు పొందుటకై నా మీద అపరాధము మోపుదువా ? నాకు కలిగియున్న బాహుబలము నా స్వరము నీకుందా అంటున్నాడు. మనము అప్పుడప్పుడు దేవుని కంటే గొప్ప వారము అనే భావము సాతాను కలుగజేస్తాడు. ఊరిలో పడకుందుము గాక !

**10-14వ. దేవుడు ఇంకా అంటున్నాడు :-** యోబూ నిన్ను నీవు అలంకరించుకొని గౌరవ ప్రభావములను, ధరించుకొనుము. నీ ఆగ్రహమును కుమ్మరించుము గర్విష్టులైన వారిని క్రుంగజేయుము. కనబడకుండ వారినందరిని బూడిదలో పాతిపెట్టుము. సమాధిలో వారిని బంధింపుము. అప్పుడు నీ దక్షిణ హస్తమే నిన్ను రక్షింపగలదని నేను నిన్ను గూర్చి ఒప్పుకొనెదను అని అంటున్నాడు. అంటే దేవుడు చేయగల పనులు ఎవరమూ చేయలేము అని ఒప్పుకోవాలి.

**15-19వ. నేను చేసిన నీటిగుఱ్ఱమును నీవు చూచియున్నావు గదా ఎద్దువలె అది గడ్డి మేయును :-** దేవుడు తాను సృజించిన నీటి గుర్రమును గురించి చెబుతున్నాడు. దాని శక్తి, బలము గొప్పది. దేవదారు చెట్టు కొమ్మను తన తోకతో వంచును. దాని యెముకలు ఇత్తడి గొట్టములు, ఇనుప కమ్ములు. అది నేను సృష్టించిన వాటిలో గొప్పది అంటున్నాడు. ఇలాంటి జంతువులను జీవరాశులను లెక్కలేనన్ని సృజించాడు. దేవుడు ఎంత గొప్పవాడో మనము గ్రహించాలి.

**20-24వ. పర్వతములలో దానికి మేత మొలచును. అరణ్య జంతువులన్నియు అచ్చట ఆడుకొనును :-** నదుల మధ్యలో అది పండుకొనును. ప్రవాహము పొంగిన భయపడదు. దానిని ఎవరు పట్టుకోలేరు. ఒక జంతువు శక్తి ఎంత గొప్పదో గ్రహించాలి. ఇలాంటి లెక్కలేనన్నిటిని సృజించిన దేవుడు ఎంత గొప్పవాడో గదా ఆయనకు విధేయులమై జీవించుదుము గాక !

# యోబు గ్రంథము 41వ అధ్యాయము (6+5+6+5+6+6=34వ.)

## అంశము :- యోబుతో దేవుని మాటలు కొనసాగుట

1-6వ. 40 అధ్యాయములో నీటిగుఱ్ఱము ఈ అధ్యాయములో మకరమును గురించిన వర్ణన ఉంది. ఇవి ఇప్పుడు మనకు కనిపించే నీటి గుఱ్ఱము, మకరము కాకపోవచ్చు అవి దేవుని సృష్టిలో గొప్ప జంతువులు. చిన్న తేలు కుడితే అల్లాడిపోతాము. ఒక మకరమే ఇంత గొప్పది. ఇలాంటి మకరాలు ఎన్నో నీటిగుఱ్రాలు, ఎన్నో ఏనుగులు, ఒంటెలు, పులులు, సింహాలు ఎన్నెన్నో దేవుడు వీటి మీద అధికారము మనకు ఇవ్వకపోతే మానవులను ఎప్పుడో నాశనము చేసేవి. (ఆది 1:28, కీర్తన 8:4-8) దేవుడు యోబుతో మకరమును లాగగలవా ? ముక్కుకు సూత్రము ఎక్కించగలవా? నీవు దానితో ఆటలాడగలవా ? అంటున్నాడు. ఇక్కడ చెప్పిన ఏ పని మకరమునకు చేయలేము. ఇప్పుడు కొందరు పెద్ద జంతువులను కూడా ఇప్పటి టెక్నాలజీని బట్టి ఆడిస్తున్నారు. ఇది మానవ జ్ఞానము అనుకుంటున్నారు. దేవుడు సృష్టిపైన అధికారము ఇవ్వడమే కారణము అని గుర్తించాలి. మన స్వంత జ్ఞానము నుండి దూరముగా ఉండాలి. దయగల దేవునికి, రక్షకునికి అన్ని మహిమలు ఇవ్వాలి.

**7-11వ. దేవుడు యోబుతో ఇంకా మాట్లాడుతున్నాడు :-** మకరము ఒంటి నిండా శూలములు గుచ్చగలవా ? దాని మీద చెయ్యి వేయగలవా? దానిని రేపగలిగిన వాడు ఎవడు లేదు. సమస్తము నాదే గదా ఎవడైనా నాకు ఏమైనా ఇవ్వగలడా (కీర్తన 59:10) అంటున్నాడు.

**12-17వ. దేవుడు మకరమును ఇంకా వర్ణిస్తున్నాడు :-** ఎవడైన దాని పై కవచమును లాగివేయగలడా ? దాని రెండు దవడల నడిమికి ఎవడైన రాగలడా ? దాని ముఖద్వారములను తెరవగలవాడెవడు ? అని భేదింప శక్యము కాకుండా అవి యొక దానితో ఒకటి కలిసికొనియున్నవి.

**18-22వ. దేవుడు ఇంకా చెబుతున్నాడు :-** అది తుమ్మితే వెలుగు. దాని నోట నుండి అగ్ని కణములు దాని నుండి లేచును. దాని మెడ బలమైనది. ఒక్క జంతువు బలమే ఇది. కోట్ల జంతువుల బలము లెక్కగట్టలేము. వీటిని సృజించిన దేవుని మహాశక్తిని లెక్కగట్టగలమా ?

**23-28వ. దేవుడు ఇంకా చెబుతున్నాడు :-** దాని మాంసము, దాని గుండె రాతివలె కఠినమైనది. అది లేస్తే భయము దానిని ఎవరూ చంపలేరు. ఖడ్గము దూయుట వ్యర్థమే! అంటున్నాడు.

**29-34వ. దేవుడు ఇంకా చెబుతున్నాడు :-** దుడ్డుకఱ్ఱలు గడ్డిపరకలుగా ఎంచబడును. కాగు మసలునట్లు సముద్రము పొంగి తైలమువలె అగును. అది భయము లేనిదిగా సృజింపబడినది. భూమి మీద దానివంటిదేదియు లేదు. అది గొప్ప వాటినన్నిటిని తిరస్కరించును. గర్వించిన జంతువులన్నిటికి అది రాజు. దేవుడు ఒక జంతువును గూర్చి ఒక అధ్యాయం వ్రాయించాడు. మొత్తము సృష్టిని గురించి వ్రాస్తే భూలోకములో ఏ గ్రంథము చాలదు. కనుక ప్రతి వస్తువు మంచిది, ప్రతి వస్తువు దాని ప్రయోజనము నిమిత్తము సృజించబడెను అని ఎరిగి వినయముతో నడుచుకుందుము గాక! **1 తిమోతి 4:4, సామె 16:4.**

# యోబు గ్రంథము 42వ అధ్యాయము (6+2+2+7=17వ.)

**అంశము :- యోబుతో దేవుడు మాటలు ముగించి యోబును ఆశీర్వదించుట.**

**1-6వ. యోబు యెహోవాతో ఈలాగు ప్రత్యుత్తరమిచ్చెను :-** నీవు సమస్త క్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని. జ్ఞానములేని మాటలచేత వివేచనలేనివాడనైన నేను ఏమియునెరుగక నా బుద్ధికి మించిన సంగతులను గూర్చి మాటలాడితిని. దయచేసి నా మాట ఆలకింపుము. వినికిడిచేత నిన్ను గూర్చిన వార్త నేను వింటిని. అయితే ఇప్పుడు నేను నిన్ను చూచుచున్నాను. కావున నన్ను నేను అసహ్యించుకొని, ధూళిలోను, బూడిదలోను పడి పశ్చాత్తాపపడుచున్నాను అంటున్నాడు. యోబు తన నేరాన్ని గ్రహించాడు. పాపిగా తనను తాను అసహ్యించుకొని పశ్చాత్తాపపడుతున్నాడు.

**7-8వ. యెహోవా యోబు స్నేహితులతో మాట్లాడుట :-** ఎలీఫజుతో ఈలాగు సెలవిచ్చెను. నా సేవకుడైన యోబు పలికినట్లు మీరు నన్ను గూర్చి యుక్తమైనది పలుకలేదు గనుక నా కోపము నీ మీదను నీ ఇద్దరు స్నేహితుల మీద మండుచున్నది. కాబట్టి యేడు ఎడ్లను ఏడు పొట్టేళ్లను మీరు తీసికొని, నా సేవకుడైన యోబు నొద్దకు పోయి మీ నిమిత్తము దహనబలి అర్పింపవలెను. అప్పుడు నా సేవకుడైన యోబు మీ నిమిత్తము ప్రార్థన చేయును. మీ అవివేకమునుబట్టి మిమ్ము శిక్షింపకయుండునట్లు నేను అతని మాత్రము అంగీకరించెదను; ఏలయనగా నా సేవకుడైన యోబు పలికినట్లు మీరు నన్ను గూర్చి యుక్తమైనది పలుకలేదు. దేవుడు పొరపాట్లు చేసిన మిత్రుల కొరకు యోబు విజ్ఞాపనను అంగీకరిస్తున్నాడు. యోబులో కూడా పొరపాట్లు ఉన్నవి. అయితే పశ్చాత్తాపపడ్డాడు. పశ్చాత్తాపము అవసరము లేని మన ప్రభువు విజ్ఞాపన ఎంతో గొప్పది. యోబును బట్టి స్నేహితులను అంగీకరించినట్లే ప్రభువును బట్టి మనలను దేవుడు అంగీకరిస్తాడు. ఇది ఎంత భాగ్యము.

**9-10వ. యోబును బట్టి స్నేహితులను అంగీకరించిన దేవుడు :-** స్నేహితులు యెహోవా తమకు ఆజ్ఞాపించినట్లు చేయగా యెహోవా వారి పక్షమున యోబును అంగీకరించెను. యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు యెహోవా అతని క్షేమస్థితిని

మరల అతనికి దయచేసెను. మరియు యోబునకు పూర్వము జరిగిన దానికంటె రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను. యోబు పశ్చాత్తాపపడడమే గాకుండా స్నేహితులను క్షమించి వారికొరకు విజ్ఞాపన చేయడము గొప్ప విషయము అందుకే దేవుడు యోబును రెండంతలుగా ఆశీర్వదించాడు. పరలోక సంబంధమైన ఆశీర్వాదాలు దేవుడు క్రీస్తునందు ఉచితముగా అనుగ్రహించాడు. ఈ లోక సంబంధమైన ఆశీర్వాదాలు ఇతరులను క్షమించి పొందుదుము గాక !

**11-17వ. యోబు సంబంధులందరు యోబు దగ్గరకు వచ్చుట :-**

అతని సహోదరులందరును అతని అక్క చెల్లెండ్రందరును అంతకుముందు అతనికి పరిచయులైనవారును వచ్చి, అతనితో కూడ అతని యింట అన్నపానములు పుచ్చుకొని, యెహోవా అతని మీదికి రప్పించిన సమస్త బాధను గూర్చి ఎంతో దు:ఖము పొందితివని అతని కొరకు దు:ఖించుచు అతని నోదార్చిరి. యోబు దు:ఖపడునప్పుడు ఓదార్చడానికి ఎవరు రాలేదు. దు:ఖము పోయిన తర్వాత ఓదార్చేదేముంది నటన కాకపోతే. యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె అధికముగా ఆశీర్వదించెను. అతనికి ఏడుగురు కుమారులును, ముగ్గురు కుమార్తెలు కలిగిరి. అతడు వారికి యెమీమా, కెజీయా, కెరెంహప్పుకు అని పేళ్లుపెట్టెను. ఆ దేశములోనే యోబు కుమార్తెల అంత సౌందర్యవంతులు కనబడలేదు. వారి తండ్రి వారి సహోదరులతోపాటు వారికి స్వాస్థ్యములనిచ్చెను. ఎప్పుడో ఆడవాళ్ళకు కూడా సమాన ఆస్తి ఇవ్వబడింది. నేటికి దానిమీద సమస్యలు ఉన్నాయి. తరువాత యోబు నూటనలుపది సంవత్సరముల బ్రదికి, తన కుమారులను కుమారుల కుమారులను నాలుగు తరముల వరకు చూచెను. పిమ్మట యోబు కాలమునిండిన వృద్ధుడై మృతినొందెను. యోబు జీవితము ఎంత ధన్యము. మనమును అటువంటి జీవితము జీవించుదుము గాక !

## మా పుస్తకముల వివరములు

### కొత్త నిబంధన గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | సువార్త గ్రంథముల పరిచయము | రూ. 40-00 |
| 2. | పౌలు పత్రికల పరిచయము | రూ. 120-00 |
| 3. | సార్వత్రిక పత్రికల పరిచయము | రూ. 50-00 |
| 4. | ప్రకటన గ్రంథ పరిచయము | రూ. 50-00 |

### పాత నిబంధన గ్రంథములు

| | | |
|---|---|---|
| 5. | యెహోషువ గ్రంథ ధ్యానము | రూ. 50-00 |
| 6. | ఎజ్రా గ్రంథ ధ్యానము | రూ. 40-00 |
| 7. | నెహెమ్యా గ్రంథ ధ్యానము | రూ. 40-00 |
| 8. | యోబు గ్రంథ ధ్యానము | రూ. 70-00 |
| 9. | కీర్తనల గ్రంథ పరిచయము (మొదటి భాగము) | రూ. 80-00 |
| 10. | కీర్తనల గ్రంథ పరిచయము (రెండవ భాగము) | రూ. 80-00 |
| 11. | సామెతల గ్రంథ పరిచయము | రూ. 80-00 |
| 12. | యెషయా గ్రంథ పరిచయము | రూ. 80-00 |
| 13. | యిర్మీయా గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 14. | యెహెజ్కేలు గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 15. | దానియేలు గ్రంథ పరిచయము | రూ. 50-00 |
| 16. | ప్రవక్తల చిన్న గ్రంథముల పరిచయము | రూ. 60-00 |
| 17. | ప్రసంగి గ్రంథ పరిచయము | రూ. 30-00 |
| 18. | ఇశ్రాయేలు దేశము | రూ. 30-00 |
| 19. | సంఘ చరిత్ర | రూ. 30-00 |
| 20. | మాకు తోడైయున్న దేవుని కృప | రూ. 30-00 |
| 21. | పరిశుద్ధ గ్రంథమునందలి నామములు-అర్థములు | రూ.120-00 |

### పరిశుద్ధ గ్రంథమునందలి స్త్రీలను గూర్చిన గ్రంథములు

| | | |
|---|---|---|
| 22. | రూతు గ్రంథ ధ్యానము (కెజియా కుమారి) | రూ. 50-00 |
| 23. | ఎస్తేరు గ్రంథ ధ్యానము (కెజియా కుమారి) | రూ. 50-00 |
| 24. | ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు - 1 (కెజియా కుమారి) | రూ. 60-00 |
| 25. | ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు - 2 (కెజియా కుమారి) | రూ. 60-00 |
| 26. | ప్రభువు - పరిశుద్ధ స్త్రీలు - 3 (కెజియా కుమారి) | రూ. 60-00 |

**for our books visit website :**

**www.telugubiblestudy.org**

శ్రీలత ఆఫ్‌సెట్, తెనాలి. 9247872191